


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 24 జులై 2021 సంపుటి : 02 సంచిక :358 పేజీలు : 4 వెల : రూ 3-00


## పార్లమెంట్‌ను కుదిపేస్తున్న పెగాసస్



న్యూఢిల్లీ, జూలై 23, (న్యూస్ పల్స్)కేంద్ర మంత్రులు, ప్రతిపక్ష నేతలు, మీడియా వ్యక్తులు సహా అనేక మంది ప్రముఖుల ఫోన్లను పెగాసస్ సాఫ్ట్‌వేర్‌తో హ్యాకింగ్ చేశారన్న వార్తలు కలకలం రేపుతున్నాయి. మన ఫోన్‌లో డేటా మొత్తాన్ని మన తెలియకుండా ఈ సాఫ్ట్‌వేర్ సాయంతో హ్యాకర్లు చూసేస్తారు. ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, వాట్సాప్ చాట్ ఇలా ఒకటేమిటి అన్నీ మనకు తెలియకుండానే వేరెవరో చూస్తుంటారు. అంతేకాదు, మన కెమెరాను కూడా మనకు తెలియకుండా ఆన్ చేసి మనం ఏం చేస్తున్నామో కూడా చూడగలరు. హ్యాకింగ్, స్పైయింగ్‌లో పెగాసస్ అనేది అత్యంత శక్తిమంతమైన, అడ్వాన్స్‌డ్ సాఫ్ట్‌వేర్. అయితే ఇదొక్కటే కాదు మన ఫోన్లను హ్యాక్ చేసి, మనం ఏం చేస్తున్నామో స్పై చేసే స్పైవేర్, మాల్‌వేర్ సాఫ్ట్‌వేర్లు చాలానే ఉన్నాయి. వీటి సాయంతో హ్యాకర్లు సామాన్య ప్రజల ఫోన్లను కూడా టార్గెట్ చేసి, మన పర్సనల్ డేటా మొదలు బ్యాంకు వివరాలు అన్ని తెలుసుకునే ప్రమాదం ఉంది. హ్యాకర్లు మన ఫోన్‌ను ఎక్కోడ ఉండి ఆపరేట్ చేసే టెక్నాలజీలు కూడా ఉన్నాయని టెక్నాలజీ ఎక్స్‌పర్టులు చెబుతున్నారు. వాళ్లు మన ఫోన్ ఆపరేట్ చేస్తున్నట్లు కూడా తెలియకుండానే ఇదంతా జరిగిపోతుంది. మనకు తెలియకుండా ఎలా హ్యాక్ చేస్తారు? అందుకు హ్యాకర్లు వాడే మార్గాలేంటి? అనేవి ఒక్కసారి చూద్దాం. కొన్ని మార్గాల్లో చేసే హ్యాకింగ్ నుంచి మనం ఏం చేసినా తప్పించుకోలేం. మరి కొన్నింటి నుంచి మాత్రం మనం జాగ్రత్తగా ఉండే తప్పించుకునే చాన్స్ ఉంది.

మిస్డ్ కాల్ ద్వారా

పెగాసస్ సాఫ్ట్‌వేర్ సాయంతో మిస్డ్‌కాల్ ద్వారా కూడా మన ఫోన్‌లో స్పైవేర్‌ను ప్రవేశపెట్టి హ్యాక్ చేయొచ్చు. 2019లో వాట్సాప్‌లో ఉన్న ఒక లూప్ హోల్‌ను దాని యాజమాన్యం గుర్తించింది. ఈ లూప్ హోల్ ద్వారానే టార్గెట్ చేసిన ఫోన్‌కు మిస్డ్‌కాల్ ఇచ్చి, స్పైవేర్‌ను ప్రవేశపెడుతున్నట్లు తేలింది. దీని ద్వారా ఆండ్రాయిడ్‌తో పాటు ఐవోఎస్ ఫోన్లను కూడా హ్యాక్ చేయొచ్చు. ఇక్కడ ఆ మిస్డ్ కాల్ వచ్చినట్టు కూడా మనకు తెలియదు.

ఫేక్ యాప్స్

సైబర్ క్రిమినల్స్, హ్యాకర్లు స్పైవేర్‌ను టార్గెట్ చేసిన ఫోన్లలో ప్రవేశపెట్టేందుకు చాలా ఈజీ మార్గం ఫేక్ యాప్స్. మామూలుగా స్మార్ట్‌ఫోన్ల యూజర్లకు అవసరమైన యాప్స్‌ను పోలినట్టుగానే ఉండే నకిలీ యాప్స్ ప్లే స్టోర్‌లో పెడతారు. వాటిలో వాస్తవానికి అసలైన యాప్ ఉండదు. మనం తెలియక ఆ యాప్స్‌ను డౌన్‌లోడ్ చేశామంటే ఆటోమేటిక్‌గా ఫోన్ హ్యాక్ అయిపోతుంది. సోషల్ మీడియాలో, కొన్ని రకాల వెబ్‌సైట్లలో, పోర్న్ సైట్లలో కూడా ఈ ఫేక్ యాప్స్‌కు సంబంధించిన లింక్ ఎక్కువగా కనిపిస్తూ ఉంటాయి. పొరబాటున కూడా వాటిని క్లిక్ చేయకూడదు. అలాగే కొత్త యాప్స్ డౌన్‌లోడ్ చేసేటప్పుడు ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకోవడం మంచిది.

వాట్సాప్, ఈ?మెయిల్, ఎస్ఎంఎస్

వాట్సాప్, ఈ?మెయిల్స్, ఎస్ఎంఎస్ ద్వారా కూడా హ్యాకర్లు స్పైవేర్ లింకులు పంపుతారు. లోన్లు ఇస్తామని, జాబ్ ఆఫర్ అని, సర్‌ప్రైజ్ గిఫ్ట్ అని, లక్కీ డిప్ అని, ఫోన్‌కు కొత్త ఫీచర్స్ అని ఇలా రకరకాల ఫేక్ లింక్స్ క్రియేట్ చేసి వాట్సాప్, ఈమెయిల్, లేదా ఎస్ఎంఎస్ ద్వారా పంపి, మీ ఫోన్‌ను హ్యాక్ చేసే ముప్పు ఉంటుంది. పొరబాటున ఆ లింక్‌ను క్లిక్ చేస్తే ఫోన్‌లో హ్యాకర్ పంపిన వైరస్ ఇన్‌స్టాల్ అవుతుంది. దీంతో అది మన డేటాను మొత్తం హ్యాకర్‌కు పంపేస్తుంది. ఫోన్ ఆ హ్యాకర్ కంట్రోల్‌లోకి వెళ్లిపోతుంది. అందుకే అనవసరంగా పనికిరాని లింక్‌లు ఓపెన్ చేయకుండా ఉంటే బెటర్.

సిమ్ కార్డ్ స్వాప్

మన పర్సనల్ డేటా పొరబాటున హ్యాకర్లకు దొరికితే హ్యాకర్లు సిమ్ కార్డు స్వాప్ టెక్నిక్ వాడుతారు. ఆ డేటా సాయంతో హ్యాకర్లు టెలికాం ఆపరేటర్‌కు కాల్ చేసి సిమ్ రిప్లేస్‌మెంట్ కోసం డిమాండ్ చేస్తారు. ఒకవేళ సిమ్ ఇష్యూ అయితే మన ఫోన్‌లో ఉన్న పాత సిమ్ డీయాక్టివేట్ అవుతుంది. దీంతో ఇక హ్యాకర్‌కు మన ఫోన్ నంబర్ ఫుల్ యాక్సిస్ వచ్చేస్తుంది. దీంతో మన బ్యాంక్ లావాదేవీలు, ఓటీపీలు అన్నీ ఆ ఫోన్‌కే వెళ్తాయి.

## రాజ్యసభలో గందరగోళం, టీఎంసీ ఎంపీ సస్పెన్షన్

మూడో రోజూ పార్లమెంటులో పెగాసస్ పొగలు

టీఎంసీ ఎంపీ సస్పెన్షన్

ప్రతిపల నిరసనల మధ్య ఉభయ సభలూ వాయిదా

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా ప్రకంపనలు రేపిన పెగాసస్ ప్రముఖుల ఫోన్ల హ్యాకింగ్ వ్యవహారం పార్లమెంటు ఉభయ సభల్లోనూ మూడవ రోజు కూడా సెగలు పుట్టించింది. పెగాసస్ స్పైవేర్ కుంభకోణం నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని ప్రతిపలు పట్టుబట్టడంతో పెద్దల సభ రాజ్యసభలో శుక్రవారం తీవ్ర గందరగోళం నెలకొంది. ప్రధానంగా తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ శంతను సేన్‌పై వేటు వేయడం ఆందోళనకు దారి తీసింది. ఈ వర్షాకాల సమావేశాల కాలానికి రాజ్యసభ నుంచి శంతనును సస్పెండ్ చేశారు. పార్లమెంటరీ వ్యవహారాల సహాయమంత్రి వీ మురళీధరన్ సస్పెన్షన్ కోసం తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్య నాయుడు ఈ తీర్మానాన్ని ఆమోదిస్తూ, సేన్‌ను సస్పెండ్ చేశారు. సభలో పత్రాలను చించివేసిన అంశంపై టీఎంసీ ఎంపీ డెరెక్ ఓబ్రియన్ ప్రకటన సందర్భంగా దుమారం రేగింది. అనంతరం సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయివా దేశారు. అటు ఇదే



అంశంపై ప్రతిపల నిరసనల మధ్య లోక్‌సభ సోమవారానికి వాయిదా పడింది. మరోవైపు ఉగ్రవాదులపై వాడాల్సిన ఆయుధాన్ని దేశన్యాయవ్యవస్థ, ప్రతిపక్షనేతలపై ఎక్కు పెట్టడం, జర్నలిస్టులపై నిఘా పెట్టడంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. తన ఫోన్లన్నింటిని కూడా ట్యాప్ చేసిన ఉంటారనిఆరోపించారు. దీనిపై జ్యుడిషియల్ విచారణకు ఆదేశించాలని రాహుల్ డిమాండ్ చేశారు. కాగా పెగాసస్ వ్యవహారంపై గురువారం రాజ్యసభలో ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ సమాధానం ఇస్తుండగా, ఆ పత్రాలను లాక్కొని చించి వేశారు. దీంతో డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ సభను వాయిదా వేసిన సంగతి తెలిసిందే.

## 30 ఏళ్లుగా బీసీలకు టీడీపీ మోసం: మంత్రి అనిల్

అమరావతి:జూలై 23,( విభారె) టీడీపీ నేత అచ్చెన్నాయుడువి మతిలేని మాటలు అని మంత్రి అనిల్ కుమార్ యాదవ్ విమర్శించారు. 30 ఏళ్లుగా బీసీలను టీడీపీ మోసం చేస్తూనే వస్తోందని గుర్తుచేశారు. బీసీల కోసం 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని



మంత్రి అనిల్ తెలిపారు. 2024 ఎన్నికల్లో టీడీపీకి డిపాజిట్లు కూడా దక్కవని జోస్యం చెప్పారు. అచ్చెన్నాయుడు మంత్రి అనిల్ కుమార్ యాదవ్ శుక్రవారం కౌంటర్ అటాక్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అచ్చెన్నాయుడు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. బడుగు బలహీన వర్గాలకు ఎవరూ ఇవ్వని ప్రాధాన్యం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్నారన్నారని తెలిపారు. అర్ధ శాతం రాజకీయ పదవులు బడుగు, బలహీన వర్గాలకు సీఎం కేటాయించారని వివరించారు. ఒకేసారి 1,30,000 వేల ఉద్యోగాలు భర్తీ చేసిన ఘనత కూడా తమ ప్రభుత్వానిదేనని ప్రకటించారు. సీఎం జగన్ వెంటే బీసీలు ఉండటాన్ని జీర్ణించుకోలేని అచ్చెన్నాయుడు విమర్శలు చేయటం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## జగన్ నివాస పరిధిలో కూల్చివేతలపై ఏపీ హైకోర్టు ఉత్తర్వులు



అమరావతిజూలై 23,( విభారె) : ఏపీ సీఎం నివాస పరిధిలో కూల్చివేతలపై ఏపీ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. నిర్వాసితులు ఆగస్టు 6 వరకు ఖాళీ చేయించొద్దని ఏపీ హైకోర్టు ఆదేశాలిచ్చింది. తాడేపల్లి అమరారెడ్డి నగర్‌లో కూల్చివేతలపై హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. తాత్కాలిక నివాసాలు చూసుకోవడానికి ఆగస్టు 6 వరకూ కోర్టు సమయం ఇచ్చింది.

## ఏపీలో ఆగస్టు 16 నుంచి పాఠశాలల పునఃప్రారంభం: సీఎం జగన్

విద్యాశాఖలో నాడు-నేడుపై సీఎం వైఎస్ జగన్ సమీక్ష



అమరావతి జూలై 23,( విభారె) : విద్యాశాఖకు సంబంధించిన నాడు-నేడు కార్యక్రమంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం సమీక్ష చేపట్టారు. ఆగస్టు 16 నుంచి పాఠశాలల పునఃప్రారంభం చేయాలని.. అప్పుడే మొదటి విడత నాడు-నేడు పనులను ప్రజలకు అంకితం చేయాలని సీఎం జగన్ నిర్ణయించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. "నాడు-నేడు పనుల్లో అవినీతికి తావుండకూడదు. పిల్లల కోసం నాడు-నేడుతో మంచి కార్యక్రమం చేపట్టాం. పాఠశాలల అభివృద్ధిపై గతంలో ఏ ప్రభుత్వం ఆలోచన చేయలేదు. నాడు-నేడు పనులపై చిన్న వివాదం కూడా రాకూడదువవ అని అధికారులను ఆదేశించారు. పాఠశాలలు పునఃప్రారంభించిననాడే రెండో విడత నాడు-నేడు పనులకు శ్రీకారం చుట్టడమే కాక.. నూతన విద్యా విధానం గురించి ప్రభుత్వం సమగ్రంగా వివరిస్తుందని సీఎం జగన్ తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ.. "ఆగస్టు 16న స్కూళ్లు పునఃప్రారంభించాలని సీఎం జగన్ నిర్ణయించారు. ఆగస్టు 16న పండుగలా అనేక కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నాం. తొలి విడత నాడు-నేడు కింద 15వేలకు పైగా స్కూళ్లను తీర్చిదిద్దాం. రెండో దశ కింద 16వేల స్కూళ్ల పనులను.. ఆగస్టు 16న ప్రారంభిస్తాం. విద్యాకానుక కిట్లు కూడా అందించబోతున్నాంవవ అని తెలిపారు.

## ఏపీ ఇంటర్ సెకండియర్ ఫలితాలు విడుదల



అమరావతి:జూలై 23,( విభారె) ఇంటర్మీడియెట్ సెకండియర్ ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ ఫలితాలను విడుదల చేశారు. సెకండియర్ విద్యార్థులందరూ పాస్ అయినట్లు ఆయన ప్రకటించారు. ఇంటర్ సెకండియర్ విద్యార్థులను ప్రమోట్ చేస్తున్నామన్నారు. సుప్రీంకోర్టు సూచనల మేరకు పరీక్షలు రద్దు చేశామని, కరోనా నిబంధనలు పాటించి ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించామని మంత్రి సురేష్ పేర్కొన్నారు.పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన మూడు సబ్జెక్ట్‌ల యావరేజ్‌కి 30 శాతం.. ఇంటర్ మొదటి ఏడాదిలో ప్రతిభకి 70 శాతం వెయిటేజ్‌తో ఫలితాలు ప్రకటించామని ఆయన పేర్కొన్నారు. ఫస్ట్ ఇయర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులను పాస్ చేశామని తెలిపారు. విద్యార్థులకు ఈ ఫలితాలపై అసంతృప్తి ఉంటే కోవిడ్ తగ్గిన తర్వాత పరీక్షలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని మంత్రి పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఇబ్బంది లేకుండా మార్కులే ప్రకటించామన్నారు.మొదటి సంవత్సరం విద్యార్థులను కూడా ప్రమోట్ చేస్తున్నామన్నారు. భవిష్యత్‌లో పరిస్థితులు అనుకూలిస్తే బెటర్ మెంట్ పేరుతో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. పదవ తరగతి ఫలితాలను వారం రోజులలో ప్రకటిస్తామని మంత్రి వెల్లడించారు. ఇంటర్, డిగ్రీ అడ్మిషన్లు ఆన్ లైన్ లోనే నిర్వహిస్తామని పేర్కొన్నారు. అడ్మిషన్లలో అవకతవకలకి పాల్పడే కళాశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని మంత్రి సురేష్ హెచ్చరించారు.

## వ్యవసాయ రంగానికి సీఎం జగన్ పెద్దపీట: కన్నబాబు

గత ప్రభుత్వం రైతుల గురించి ఆలోచించలేదు

మంత్రి కురసాల కన్నబాబు

విజయవాడ జూలై 23,( విభారె) : వ్యవసాయ రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని.. వడ్డీ లేని రుణాలు అందిస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కురసాల కన్నబాబు అన్నారు. కృష్ణాజిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఛైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో మంత్రి ఆళ్ల నాని, ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, సామినేని ఉదయభాను, జోగి రమేష్, మహిళ కమిషనర్ చైర్ పర్సన్



వాసిరెడ్డి పద్మ, ఏపీ ఎస్ఎఫ్ఎల్ చైర్మన్ పూనూరు గౌతమ్‌రెడ్డి, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బొప్పన భవ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కన్నబాబు మాట్లాడుతూ, రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. రాష్ట్రంలో 10,850 ఆర్బీఐ కేంద్రాల ఏర్పాటు చేశామన్నారు. గత ప్రభుత్వం రైతుల గురించి ఆలోచించలేదన్నారు. రైతు భరోసా కేంద్రాలను మార్కెట్ కేంద్రాలుగా మార్చామని పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతుల అభ్యున్నతికి సీఎం జగన్ కట్టుబడి ఉన్నారని మంత్రి కన్నబాబు అన్నారు.

## తాడో పేడో తేల్చుకుంటాం..: సోమిరెడ్డి

కర్నూలు జూలై 23,( విభారె) : ఆరు జిల్లాల ప్రజలు ఏకమవుతామని.. తాడో పేడో తేల్చుకుంటామని టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ 'సీఎం జగన్.. కాంట్రాక్టర్ల కోసం, అడ్వాన్సుల కోసం ప్రాజెక్టులు చేయకండి.. రైతుల కోసం ప్రాజెక్టులు చేయండి..వ అని సూచించారు. ముఖ్యమంత్రి ఒంటెద్దు పోకడ సమస్యలు తెచ్చి పెడుతున్నాయన్నారు. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులన్నీ నిలిపేసి ఏదో ఘనకార్యం చేసినట్టు సీఎం చెబుతున్నారని విమర్శించారు. కేఆర్ఎంబీ టీమ్‌ని అనుమతించాలని, ఏ నివేదిక ఇస్తుందో చూద్దామని అన్నారు.జల వివాదంపై సీఎం జగన్, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో మాట్లాడాలని సోమిరెడ్డి సూచించారు. తెలంగాణలో అక్రమంగా నిర్మిస్తున్న ప్రాజెక్టులపై పోరాడాలన్నారు. శ్రీశైలం ప్రాజెక్ట కోసం 80 వేల కుటుంబాలు నిర్వాసితులయ్యాయన్నారు. పోలవరం నుంచి గోదావరి జలాలు వస్తే కృష్ణా జలాలను రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు నిఖర జలాలుగా ఇవ్వాలని సోమిరెడ్డి కోరారు.



# సంపాదకీయం

శనివారం 24 జూలై 2021

## సహకార రంగం భవిష్యత్తు పై నీలినీడలు

జులై 7న జరిగిన కేంద్ర మంత్రివర్గ విస్తరణలో కొత్తగా సహకార మంత్రిత్వశాఖ ఏర్పాటుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇది రాష్ట్రాల అధికారంలోకి చొరబడటమేనని విపక్షాలు ధ్వజమెత్తుతున్నాయి. సహకార సంఘాలు రాష్ట్రాల పరిధిలోని అంశమని రాజ్యాంగంలోని ఏడో షెడ్యూల్ స్పష్టం చేస్తోందని కాంగ్రెస్, సీపీపీ, సీపీఎం తదితర ప్రధాన ప్రతిపక్షాలు గుర్తు చేస్తున్నాయి. ఇది సమాఖ్య విధానానికి గండికొట్టడమేనని అవి విమర్శిస్తున్నాయి. నిపుణుల నుంచి కూడా దాదాపు ఇలాంటి అభిప్రాయాలే వ్యక్తమవుతున్నాయి. మంత్రిత్వశాఖ ఏర్పాటుతోపాటు దానికి సారథిగా కరడుగట్టిన అమిత్ షా ను సారథిగా నియమించడం వెనక భారతీయజనతా పార్టీకి రహస్య అజెండా ఉందని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. అయితే అలాంటిది ఏమీ లేదని, సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, తద్వారా ప్రజలకు మెరుగైన నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యమని భారతీయ జనతా పార్టీ వర్గాలు సమర్థించుకుంటున్నాయి. సహకార రంగంలో ఉన్న లోటుపాట్లను సరిదిద్ది దానిని బలోపేతం చేయడమే లక్ష్యమని కేంద్ర ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. క్షేత్రస్థాయిలో సహకార రంగం, రాజకీయ రంగం కలగాపులగంగా ఉన్నాయి. కొన్ని రాష్ట్రాల్లో సహకార రంగం శక్తిమంతంగా ఉంది. రాష్ట్ర రాజకీయాలపైనా అది ప్రభావం చూపుతోంది. ప్రధాని మోదీ సొంత రాష్ట్రమైన గుజరాత్ లో సహకార రంగంలోని పాల డెయిరీలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. నాలుగు దశాబ్దాల క్రితమే ఈ రాష్ట్రంలోని 'ఆనంద్'లో డెయిరీ రంగానికి కురియన్ పునాదులు వేశారు. ఇప్పుడు ఇది దేశవ్యాప్తంగా విస్తరించింది. ఏపీలోని సంగం డెయిరీ రాజకీయంగా ఎంత శక్తిమంతమైనదో తెలిసిందే. మహారాష్ట్రలో బలంగా ఉన్న సహకార చక్కెర రంగం రాజకీయాలను పరోక్షంగా శాసిస్తోంది. ఈ రంగం నుంచి వచ్చిన నాయకులు కొంతమంది రాజకీయంగా అత్యున్నత స్థాయికి చేరుకున్నారు. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అధినేత శరద్ పవార్, ఆయన మేనల్లుడైన ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ సహకార రాజకీయాల్లో అరంగ్రేటం చేసి ఎదిగిన వారే. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సైతం ఒకప్పుడు అహమ్మదాబాద్ సహకార బ్యాంకు ఛైర్మన్ గా పనిచేసి పైకొచ్చిన వారే కావడం గమనార్హం. మహారాష్ట్ర లోని శివసేన, కాంగ్రెస్, ఎన్ సీపీ సంకీర్ణ సర్కారును దెబ్బతీసేందుకే కొత్తగా సహకార మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేశారనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. మహారాష్ట్ర సహకార రంగ రాజకీయాల్లో బీజేపీ వెనకబడి ఉందన్నది వాస్తవం. దీన్ని సరిదిద్దికోవడమే తాజా ప్రయత్నమన్నది విశ్లేషకుల అంచనా. సహకార రంగంలో చేనేత, బ్యాంకులు, డెయిరీలు విస్తరించి ఉన్నాయి. కొత్తగా తీసుకువచ్చిన వ్యవసాయ చట్టాల ద్వారా ఆ రంగంపై పట్టు పెంచుకోవాలన్నది కేంద్రం వ్యూహం. అదే విదంగా తాజా మంత్రిత్వశాఖ ఏర్పాటు ద్వారా విభిన్న రంగాలపై నియంత్రణ సాధించాలన్నది బీజేపీ పెద్దల వ్యూహం గా కనపడుతోంది. దేశవ్యాప్తంగా సుమారు 1,94, 195 పాల సంఘాలు ఉన్నాయి. దాదాపు 330 సహకార చక్కెర కర్మాగారాలు ఉన్నాయి. నాబార్డ్ (నేషనల్ బ్యాంకు ఫర్ అగ్రికల్చరల్ అండ్ రూరల్ డెవలప్ మెంట్) అంచనాల ప్రకారం 95,238 గ్రామ స్థాయిలో వ్యవసాయ పరపతి సంఘాలు ఉన్నాయి. 363 జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లు, పెద్దసంఖ్యలో రాష్ట్ర సహకార బ్యాంకులు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. రాష్టాల సహకార బ్యాంకుల్లో రమారమి రూ. 1,35,393 కోట్ల డిపాజిట్లున్నాయి. ఇంతకన్నా పెద్ద మొత్తంలో రుణాలను ఇవి అందజేస్తున్నాయి. జాతీయస్థాయిలో ఎలా ఉన్నప్పటికీ ఇప్పటికీ కిందిస్థాయిలో సహకార రంగం శక్తిమంతంగా ఉంది. ఇందులో బీజేపీ ప్రమేయం తక్కువే. కాంగ్రెస్, వామపక్షాలు, ప్రాంతీయ పార్టీలకే వీటిపై పట్టుంది. ఈ పరిస్థితిని అధిగమించి క్షేత్రస్థాయిలో పార్టీ పరంగా బలోపేతమయ్యేందుకు భాజపా పెద్దలు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగమే కొత్తగా సహకార మంత్రిత్వశాఖ ఏర్పాటు. దానికి ప్రధాని తరవాత అంతటి శక్తిమంతుడైన, ఆయనకు కుడిభుజంగా పేరొందిన అమిత్ షా ను సారథిని చేయడమన్నది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. దీనిని తోసిపుచ్చడం కష్టమే మరి.

# టీడీపీ...లాజిక్ మిస్

గుంటూరు, జూలై 23, (న్యూస్ పల్స్)రాజకీయాలు అంటే ఎన్నో వ్యూహాలు ఉంటాయి. అయితే వాటిని ప్రయోగించేటపుడు కొన్ని విలువలూ మర్యాదలూ కూడా ఉంటాయి. అల్టిమేట్ గా జనాదరణ పొందడం అధికారంలోకి రావడమే ప్రజాస్వామ్యంలో ఎవరైనా చేయాల్సిన పని. గతంలో అయితే తాము చేసిన మంచి పనులు చెప్పి నాయకులు అధికారంలోకి వచ్చే ప్రయత్నం చేసేవారు. ఆ తరువాత కాలంలో చూసుకుంటే తమ వైపు పాజిటివిటీ కంటే అవతల పార్టీ నెగిటివిటీని పెద్దగా ప్రచారం చేసి అధికారంలోకి రావడం జరుగుతూ వస్తోంది. ఇదిపుడు ఇంకా పీక్ స్టేజ్ కి వెళ్ళిపోయింది. యుద్ధంలో సమరనీతి ఉంటుంది. నిరాయుధుడిని కొట్టకూడదు అంటారు, అలాగే అవతల వారు తయారుగా లేనపుడు దొంగ దెబ్బ తీయకూడదు అని చెబుతారు. కానీ రాజకీయాల్లో అలాంటి నియామాలు ఏవీలేవు. దాంతో పరాకాష్టకు పోతున్నారు. తమ ప్రత్యర్ధిని జనంలో ఉంచి ఆయన తప్పులు చూపించి పవర్ లోకి రావడం నిన్నటి నీతి అయింది. ఇపుడు ఏకంగా వైరి పక్షం నేత సీన్ లోనే లేకుండా చేసే దారుణమైన వ్యూహాలకు ఒడికడుతున్నారు. విషయానికి వస్తే ఏపీ రాజకీయాలు దిగజారిపోయాయని వేరేగా చెప్పాల్సిన అవసరం లేదు. రెండు కులాలు, రెండు కుటుంబాలు, దశాబ్దాల వైరం. ఇదే ఇపుడు ఎలాంటి పని అయినా చేయించేస్తోంది అన్న విశ్లేషణలు ఉన్నాయి. జగన్ అధికారంలో ఉండగా తాము రాలేము అన్న భయమో బెంగో ఎక్కడో ఒక చోట ఉందేమో తెలియదు కానీ తెలుగుదేశం పార్టీ అధినాయకత్వం తెగ కలవరపాటుకు గురి అవుతోంది. జగన్ ని జైలుకు పంపాలి అన్నదే గత పన్నెండేళ్ళుగా ఆ పార్టీ ఏకైక అజెండా అయింది. జగన్ ప్రత్యర్ధుల కోరిక్ తీర్చి పదహారు నెలలు జైలుకు వెళ్ళి వచ్చారు. బెయిల్ మీద ఆయన ఉన్నారు. ఈ దేశంలో ఆయన ఒక్కరే కాదు, చాలా మంది బెయిల్ మీద ఉన్నారు. ఆ మాటకు వస్తే స్టేల మీద ఉన్న టీడీపీ పెద్దల కథ ఏంటి అన్నది కూడా చూడాలి కదా. అర్జంటుగా జగన్ ని జైల్ కి పంపిస్తే తాము అధికారంలోకి వస్తామని ఎందుకో టీడీపీ ఒక తప్పుడు వ్యూహంతో పోతుందేమో అనిపిస్తోంది అంటున్నారు రాజకీయ పరిశీలకులు. జగన్ అయిదేళ్ల పాలన సాగనిచ్చి ఆ మీదట జనాలు ఆయన్ని వ్యతిరేకించి ఓడిస్తే దర్జాగా తెలుగుదేశం అధికారంలోకి రావచ్చు. దాని కోసం అయితే చాలానే చేయాలి. ఇక్కడ అధికారంలో ఉన్న వారికి అడ్వాంటేజెస్ ఉంటాయి, కాబట్టి తాము మళ్ళీ గెలవలేమేమో అన్న సందేహం ఏదో ఉండాలి. అందుకే జగన్ ఎన్నికల వేళకు జైలు లో ఉండాలి అని ఏదో స్కెచ్ లు వేస్తున్నారు. కానీ సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ చెప్పినట్లుగా ఇక్కడే లాజిక్ మిస్ అవుతున్నారు. జగన్ జైలు లో ఉంటే మళ్లీ ఆయనే కదా గెలిచేది. ఆ రకంగా సానుభూతిని పోగు చేయడానికేనా ఇన్ని తంటాలు అంటే టీడీపీ పెద్దల దగ్గర సమాధానం ఉండదేమో. ఏది ఏమైనా అవతల పక్షాన్ని డైరెక్ట్ గా ఎదుర్కొని గెలిస్తేనే అది ఘనమైన విజయం అవుతుంది. జనాలు కూడా అలాటి సందర్భంలోనే కచ్చితమైన తీర్పు చెబుతారు. ఇంత చిన్న విషయం తెలియకనే టీడీపీ రాంగ్ రూట్ లను, షార్ట్ కట్ మెదళ్ళను ఇప్పటికీ వెతుక్కుంటోందా అన్న చర్చ అయితే ఉంది మరి

# బొత్సకు తప్పని ఇంటి పోరు



విజయనగరం, జూలై 23, (న్యూస్ పల్స్)పార్టీ ఏదైనా కానీ విజయయనగరం జిల్లాలో బొత్స సత్యనారాయణకు హవాకు ఇప్పటిదాకా తిరుగులేదు. దశాబ్దాలుగా ఆయన జిల్లాలో తన పట్టుకుని ఆలాగే నిలబెట్టుకుంటూ వస్తున్నారు. కాంగ్రెస్ హయాంలోనూ బొత్సతో విభేదించిన వారు కూడా సైడ్ అయిపోయారు తప్ప ఎదిరించి మనలేకపోయారు. ఇపుడు వైసీపీ అధికారంలో ఉంది. బొత్స సత్యనారాయణ కీలకమైన మంత్రిత్వ శాఖలను చూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన జిల్లాలోని మొత్తం ఎమ్మెల్యేలను ఒకే తాటి మీద నడిపిస్తున్నారు అన్న మాట అయితే ఉంది. అయితే ఇందులో ఇపుడు తిరుగుబాటు స్వరం వినిపించడం మాత్రం ఆశ్చర్యకరేమే కాదు, బొత్స సత్యనారాయణకు షాక్ లాంటి పరిణామమే. విజయనగరం జిల్లా పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు తాజాగా జరిగిన అభివృద్ధి పై సమీక్షా సమావేశంలో ఏకంగా సభలోనే మంత్రి బొత్స సత్యనారాయణిని నిలదీశారు. తన నియోజకవర్గంలో ఇచ్చిన ఇళ్ల స్థలాల మీద కూడా ఆయన విమర్శలు చేశారు. అవి ఇల్లు కట్టుకునేందుకు సరైన ఆవాస యోగ్యం కావని కూడా కామెంట్స్ చేశారు. దీని మీద బొత్స సత్యనారాయణ సర్దిచెప్పే ప్రయత్నం చేసినా కూడా అలజంగి అలా రెచ్చిపోవడం బట్టి చూస్తే ఆయన బొత్స సత్యనారాయణ మీద కావాలనే విమర్శలు చేయాలని అనుకుంటున్నారని తెలిసిపోతోందని అంటున్నారు. నిజానికి అలజంగి జోగారావు కాంగ్రెస్ లో ఉండేవారు. ఆయన 2014 ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. మరో వైపు ప్రసన్న కుమార్ కి ఆ ఎన్నికల్లో వైసీపీ టికెట్ ఇచ్చింది. ఆయన విధేయుడిగా వైసీపీకి ఉంటూ వచ్చారు. కానీ బొత్స సత్యనారాయణ అలజంగిని కాంగ్రెస్ లోకి రప్పించి ఎన్నికల ముందు టికెట్ ఇప్పించారు. అంతే కాదు ఎమ్మెల్యేను చేశారు. ఇపుడు అదే అలజంగి రివర్స్ అవడం బొత్స క్యాంప్ తట్టుకోలేకపోతోంది. ఇదిలా ఉంటే ఈ ఎమ్మెల్యే మీద కొన్ని అవినీతి ఆరోపణలు కూడా ఉన్నాయి. మరో వైపు ప్రతీ దానికీ బొత్స క్యాంప్ తన మీద పెత్తనం చేయడాన్ని కూడా ఆయన సహించలేకపోతున్నారని దాంతోనే ఇలా రివర్స్ అయ్యారని టాక్. విజయనగరం

జిల్లా విషయంలో బొత్స సత్యనారాయణను బహిరంగంగా కాదని రాజకీయం చేయడం కుదిరే పని కాదు, సీనియర్ నేత కోలగట్ల వీరభద్రస్వామి కూడా బొత్స సత్యనారాయణ కలిసే ఉంటూ తన రాజకీయం తాను చేసుకుంటారు. ఇపుడు అలజంగి ఇలా చేయడం అంటే ఆయన ఒక్కరేనా, వెనక ఎవరు ఉన్నారు అన్న దాని మీద బొత్స శిబిరం ఆరా తీస్తోంది. మరో వైపు మంత్రి వర్గ విస్తరణ అంటూ జరిగితే బొత్స సత్యనారాయణను తప్పిస్తారు అన్న ప్రచారం కూడా రావడంతో ఆయన మీద ఈజీగా నాయకులు తిరిగుబాటు స్వరం వినిపిస్తున్నారా అన్న చర్చ కూడా ఉంది. మొత్తానికి జిల్లాలో తొమ్మిది మంది ఎమ్మెల్యేలు ఉంటే మెజారిటీ బొత్స గూట్లో ఇప్పటిదాకా ఉండేవారు. ఇపుడు మెల్లగా బొత్స శిబిరం బలహీనపడుతోంది అంటున్నారు. మరిది ఏ రకమైన రాజకీయ పరిణామాలకు దారి తీస్తుంది అన్నదే చూడాలి.

# విశాఖ..పరిపాలనా రాజధాని కష్టమేనా

విశాఖపట్టణం, జూలై 23, (న్యూస్ పల్స్)రాజధాని అంటేనే ఆ రాజసం దానంతట అదే వస్తుంది. దాంతో అన్నీ కూడా ఆకాశం వైపే చూస్తాయి. ఏ రాజధాని నగరమైనా బడా బాబులకే అనుకూలం తప్ప సామాన్యులకు నిలువ నీడనీయదు అన్న విమర్శలూ ఉన్నాయి. అమరావతి కొందరి రాజధాని అని వైసీపీ నిన్నటి దాకా విమర్శలు చేస్తూ వచ్చింది. ఇపుడు ఆ ప్రభుత్వం విశాఖను రాజధానిగా ఎంచుకుంటోంది. మరి విశాఖ సీన్ ఎలా ఉంది అంటే ముట్టుకుంటే షాక్ కొట్టేలా ఉంటోంది అంటున్నారు అంతా. అసలే విశాఖలో జీవన వ్యయం చాలా ఎక్కువ అని చెబుతారు. ఇపుడు రాజధాని ట్యాగ్ తో మరింతగా మండుతోంది. విశాఖ మెట్రో సిటీ నుంచి ప్రతిపాదిత రాజధాని హోదాతో ఉంది. ఇదే అనువుగా భూముల ధరలు బాగా పెరిగిపోయాయి. అమరావతిలో రియల్ ఎస్టేట్ బిజినెస్ అని అన్నారు కానీ విశాఖలోనూ దానికి మించి వ్యాపారం సాగుతోంది. ఏకంగా శ్రీకాకుళం దాకా భూముల ధరలకు రెక్కలు వచ్చేశాయి. ఇక విశాఖ వంటి చోట్ల ఎక్కువగా ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు, వ్యాపారులు ఉంటారు. కాబట్టి మొదటి నుంచి కొంత ఖరీదైన నగరంగానే చెప్పాలి. ఇపుడు రాజధాని పేరిట దానికి కొత్త మెరుగులు దిద్ది అన్ని రేట్లూ పెంచేశారు. ఇందులో వైసీపీ, టీడీపీ రెండూ ఉన్నాయనే చెప్పాలి. వైసీపీకీ పట్టం కట్టాక విశాఖ కార్పోరేషన్ తాజాగా సమావేశమైంది. చేసిన ఉపకారం ఏంటి అంటే చెత్తకు కూడా పన్ను అంటూ కొత్త వింతను చూపించింది. ప్రతీ ఇంటికీ నెలకు చెత్తను తీసుకెళ్ళడానికి యూజర్ చార్జీల కింద 120 రూపాయలను విధిస్తూ కార్పోరేషన్ నిర్ణయం తీసుకోవడంతో సామాన్యుడు హడలుతున్నాడు. ఇంతే కాదు ఆస్తి పన్నును విలువ ఆధారితంగా లెక్క వేస్తూ పెంచడం అంటే విశాఖలో ఏ రేంజిలో పన్నుల బాదుడు ఉంటుందో వేరేగా చెప్పాల్సిన పని లేదు. విశాఖలో ఉంటే చాలు ఏ స్థలానికైనా ఆటోమేటిక్ గా విలువ వచ్చేస్తుంది. దాంతో పన్నులు వీర లెవెల్ లో పెరిగాయని మధ్యతరగతి వర్గాలు గగ్గోలు పెడుతున్నాయి. ఇక విశాఖలో ఇపుడే ఏం చూశారు ముందు ముందు చాలానే తమాషాలు

ఉంటాయని విపక్ష నేతలు భయపెడుతున్నారు. వారు అన్నారని కాదు కానీ విశాఖకు నిజంగా రాజధాని వస్తే మధ్యతరగతి, పేదలు నివసించగలరా అన్నదే చర్చగా ఉంది. విశాఖలో ఆస్తిపన్ను పెంచితే అది అద్దెకున్న వారికే బదలాయింపు అవుతుంది. చెత్త పన్నులు, కొత్త పన్నులు ఎన్ని వేసినా కూడా నగరానికి వచ్చి ఉపాధి చూసుకునే వారి మీదనే ఆ భారం పడుతుంది. మరి ఇలాంటి స్థితిలో విశాఖలో ఎవరైనా ఉండగలరా అన్నదే డౌట్ గా ఉంది మరి. ఇక ప్రభుత్వం అనుకుంటున్న ప్రాజెక్టులు అన్నీ విశాఖకు వచ్చి ట్రాఫిక్ పెరిగితే మాత్రం విశాఖలో కోటీశ్వరులు తప్ప ఆ మాత్రం సంపాదన కలిగిన వారు ఉండలేరు అంటున్నారు. మొత్తానికి చూస్తే అమరావతి ఎవరిది అని నాడు దీర్ఘాలు తీసిన వారు ఇపుడు విశాఖ ఎవరిది అని కూడా అనుకోవాలేమో.

# తెరపైకి గ్రేటర్ రాయలసీమ

తిరుపతి, జూలై 23, (న్యూస్ పల్స్)రాయలసీమ నాలుగు జిల్లాలు ఉన్నాయి. కొన్ని జిల్లాలు డెబ్బై ఏళ్ళ క్రితం జరిగిన రాష్ట్రాల విభజనలో కర్ణాటకకు పోయాయి. దాంతో ఘనమైన రాయలసీమ కాస్తా ఏమీ కాకుండా ఒక ముక్కలా మిగిలిపోయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఎక్కువమంది ఈ ప్రాంతం నుంచే ముఖ్యమంత్రులు అయ్యారు. ఇక విభజన ఏపీలో కూడా ఇద్దరు సీఎంలు కూడా సీమ నుంచే ఉన్నారు. అయినా సీమకు అన్యాయం జరిగింది అంటున్నారు. నిజమే సీమకు జరిగిన అన్యాయం ముందు భౌగోళికంగా జరిగింది. ఒక మూలకు విసిరేసినట్లుగా విభజన ఏపీలో ఉంది. ఉమ్మడి ఏపీలో అయితే వారికి ఎంతో కొంత మేలు జరిగేది. ఇపుడు మరింతగా అన్యాయం అవుతోంది సీమ ప్రాంతం అంటున్నారు. కృష్ణా, తుంగభద్ర జలాల మీదనే సీమ ప్రాంతం మొత్తం ఆధారపడుతోంది. ఇక కృష్ణా నది మీద ఎంత ఎక్కువగా ఆశలు పెట్టుకుంటే అంత ఎక్కువ నష్టం జరుగుతోదని చరిత్ర చెబుతోంది. ఎగువ రాష్ట్రాలు బిర బిరా కృష్ణమ్మను కట్టిపడేస్తున్నారు. దాంతో అరకొర నీరే దిగువకు వస్తోంది. ఇక అందులో కూడా కొత్త రాష్ట్రం తెలంగాణా పేచీలతో సీమకే ఎసరు పెడుతున్నారు. ఇంకో వైపు చూస్తే కృష్ణా నీటి విషయంలో సమాన వాటాను తెలంగాణా డిమాండ్ చేస్తోంది. ఈ నేపథ్యంలో మధ్యలో కేంద్రం వచ్చి గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చేయడంతో సీమకు దారుణమైన నష్టం వాటిల్లింది అని చెప్పకతప్పదు. రాజకీయం కోసమే రాష్ట్రాల ముక్కలు అన్నది ఉమ్మడి ఏపీని రెండుగా చేశాక అందరికీ అర్ధమవుతున్న విషయం. ఇపుడు ప్రతీ దానికీ రెండు తెలుగు రాష్ట్రాలు గొడవ పడుతున్నాయి. ఈ నేపథ్యంలో సీనియర్ నేత, మాజీ మంత్రి మైసూరారెడ్డి తాజాగా సంచలన వ్యాఖ్యలే చేశారు. సీమకు కూడా ఒక ప్రభుత్వం ఉంటే అన్యాయం జరిగేనా అంటున్నారు ఆయన. దాని అర్ధం ఏంటి అంటే గ్రేటర్ రాయలసీమట. సీమలోని నాలుగు జిల్లాలు, నెల్లూరు, ప్రకాశం కలుపుకుని ఒక రాష్ట్రం కావాలని చాలా కాలంగా డిమాండ్ వుంది. ఇపుడు మైసూరారెడ్డి నీటి వివాదాలు తీసుకుని మళ్ళీ సెగ రగిలిస్తున్నారులా ఉంది అంటున్నారు. అయితే దీని వల్ల ప్రయోజనం ఏమైనా ఉందా అన్నదే మేధావుల ప్రశ్న. తెలంగాణా సంపన్న రాష్ట్రం, కోస్తా బెల్ట్ తో ఉన్న ఆంధ్రా కూడా ఎప్పటికైనా కోలుకునే ఛాన్స్ ఉంది. కానీ పూర్తిగా దుర్భిక్షంతో సతమతం అయ్యే సీమను ప్రత్యేక రాష్ట్రం చేస్తే ఇంకా నష్టమే తప్ప లాభం లేదు అన్న మాట అయితే ఉంది. ఇవాళ క్రిష్ణా నీటితో కొట్లాడుకున్నా రేపటి రోజున దానిమీద ఎవరికీ నమ్మకాలు లేవు.

# యాప్...డిలీట్...

తిరుపతి, జూలై 23, (న్యూస్ పల్స్)తిరుమల శ్రీవారితోనే ఆటలు ఆడుతున్నారు కొందరు డబ్బు పిచ్చోళ్లు. శ్రీవారి లడ్డుతోనే వ్యాపారం చేసేందుకు కొత్త మార్గాన్ని ఎంచుకున్నారు. పవిత్రమైన తిరుమల కొండను కూడా యాప్‌ల పేరిట డబ్బులు దండుకునే ప్రయత్నం చేస్తున్నారు కొందరు కాసులకక్కుర్తిగాళు.. భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా తాజాగా ఓ సంస్థ ఓ యాప్‌ను విడుదలచేసింది. తిరుమల కొండపై బస్సు ప్రయాణం పేరిట విడుదలైన ఈ యాప్ ప్రస్తుతం వివాదాస్పదం అవుతోంది. తిరుమల ఘాట్ రోడ్డులో ప్రయాణం చేసే విధంగా ఈ యాప్‌ను తయారుచేశారు. అలిపిరి గరుడ విగ్రహం నుంచి కొండపైకి.. తిరిగి తిరుపతికి ఘాట్ రోడ్డులో ప్రయాణించేలా గేమ్ డిజైన్ చేశారు. కొండపైకి బస్సు ప్రయాణం పేరిట విడుదలైన ఈ గేమ్ ఆడటానికి ఉన్న నిబంధనలు తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. కొండపైకి ఘాట్ రోడ్డులో ప్రయాణించాలంటే 20 లడ్డులు కొనాలన్న నిబంధన పలు విమర్శలకు తావిస్తోంది. ఒక్క గేమ్ ఆడటానికి 179 రూపాయలతో లడ్డులు కొనేలా ఆన్‌లైన్‌లో డబ్బులు వసూలు చేస్తోన్నారు యాప్ నిర్వహకులు. ఏడుకొండల్లో ప్రయాణం గేమ్ యాప్ పై తీవ్ర స్థాయిలో మండి పడుతున్నారు బీజేపీ నేతలు. గేమ్‌లో శ్రీవారి శ్లోకాలు వాడటంపైనా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గేమ్‌ను రూపొందించిన నిర్వాహకులను అరెస్ట్ చేయాలని బీజేపీ నేత భానుప్రకాష్ రెడ్డి డిమాండ్ చేశారు. టెక్ మేడ్స్ సంస్థకు చెందిన సురేశ్ కుమార్..ఏడాది కాలం పాటు..కష్టపడి గేమ్ రూపొందించినట్లు తెలుస్తోంది. గూగుల్ ప్లే స్టోర్ లో అందుబాటులోకి వచ్చింది. తిరుమల శ్రీవారి కొండలు, బస్సు ప్రయాణం..వర్చువల్ విధానం ద్వారా లడ్డూలు కొనాలని నిబంధన పెట్టారు. గేమ్ ఆడే వారంతా..బస్సు డ్రైవర్ గా వ్యవహరించాల్సి ఉంటుంది. గేమ్ ఆడుతున్న సమయంలో?బ్యాక్ గ్రౌండ్ లో శ్రీవారి శ్లోకాలు వినిపిస్తుండడంపై అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. విజిలెన్స్ అధికారులకు తెలిసి?టెక్ మేడ్స్ సంస్థలో సోదాలు నిర్వహించారు. యాప్ డిజైనర్, ఎండీ సురేశ్ కుమార్ ను ప్రశ్నించారు. తాను ఎవరి మనోభావాలు కించపరచలేదని చెప్పారు. శ్రీవారి లడ్డూల కొనుగోలు ప్రస్తావన, స్వామి వారి సంకీర్తల ప్రస్తావన తీవ్ర అభ్యంతకరమైందని టీటీడీ విజిలెన్స్ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. దీంతో సురేశ్ కుమార్ వెంటనే ప్లే స్టోర్ నుంచి యాప్ డిలీట్ చేశారు. కార్యాలయాన్ని మూసివేసి అతను కనిపించకుండా పోయాడు. గేమ్ లో శ్రీవారి లడ్డూలు, శ్లోకాల ప్రస్తావన అభ్యంతరకరంగా ఉందని..భక్తుల మనోభావాలు కించపరిచేలా ఉందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

# కార్యకర్తల కోసం జగన్

విజయవాడ, జూలై 23, (న్యూస్ పల్స్)వైసీపీ అధినేత జగన్ శ్రమించి ముఖ్యమంత్రి అయ్యారు. అయితే దీనిని మరోసారి సాధించాలన్న పట్టుదలతో ఉన్నారు. తొలి రెండేళ్లు సంక్షేమ కార్యక్రమాలకే సమయం కేటాయించిన జగన్ ఇప్పుడు పార్టీపై నజర్ పెడుతున్నారు. రానున్న కాలంలో వరసగా పార్టీ సమావేశాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇటు ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు కనీసం వారానికి ఒక సారి పార్టీ కార్యక్రమాలను నిర్వహించేలా ప్లాన్ చేయాలని జగన్ సీనియర్ నేతలకు ఆదేశించినట్లు తెలిసింది. ఏ పార్టీ విజయం సాధించాలన్నా అందుకు కార్యకర్త ముఖ్యం. కార్యకర్తలు అసంతృప్తికి గురయితే ఆ పార్టీ విజయావకాశాలు యాభైశాతం తగ్గినట్లే. ఈ సూత్రం ఏరాజకీయ పార్టీకయినా వర్తిస్తుంది. అందులో అధికారంలో ఉండే పార్టీకి ఈ అసంతృప్తి ఎక్కువగా ఉంటుంది. ఈ రెండేళ్ల నుంచి కరోనా కారణం కావచ్చు. సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం కోసం కావచ్చు. జగన్ పార్టీ క్యాడర్ పై దృష్టి సారించలేదు. ఎన్ని సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసినా రేపు ఎన్నికల్లో పోలింగ్ బూత్ ల వద్దకు చేర్చేది కార్యకర్తే. అందుకోసమే జగన్ దీనిపై యాక్షన్ ప్లాన్ ను రూపొందించుకున్నట్లు తెలిసింది. ముఖ్యమైన కార్యకర్తల జాబితాలను నియోజకవర్గాలుగా రూపొందించాలని, కష్టపడిన ప్రతి కార్యకర్తను గుర్తించి వారికి ప్రయోజనం చేకూర్చాలని ఇప్పటికే పార్టీ కేంద్ర నాయకత్వం నుంచి ఎమ్మెల్యేలకు ఆదేశాలు వెళ్లినట్లు చెబుతున్నారు. దీనికి తోడు జగన్ కూడా నేరుగా కార్యకర్తలతో సమావేశమయ్యేలా కూడా కొన్ని కార్యక్రమాలను ప్లాన్ చేస్తున్నారు. ఎన్నికలకు ఇంకా మూడేళ్లు ఉండటంతో ప్రతి నియోజకవర్గం కార్యకర్తలతో జగన్ సమావేశమయ్యేలా ప్రణాళిక రూపొందించాలని జగన్ ఆదేశించినట్లు తెలుస్తోంది. వచ్చే ఎన్నికల నాటికి ప్రతి ముఖ్యమైన కార్యకర్త ఏదో రకంగా ప్రయోజనం పొందేలా చూడాలన్నది జగన్ ఆలోచన. మొత్తం మీద జగన్ రెండేళ్ల తర్వాత క్యాడర్ పై దృష్టి పెట్టినందుకు కిందిస్థాయి నేతల్లోనూ సంతోషం వ్యక్త మవుతోంది

# ధమాల్ అన్న రియల్

గుంటూరు, జూలై 23, (న్యూస్ పల్స్) రాజధాని అమరావతి పరిధిలో భూముల క్రయవిక్రయాలు పూర్తిగా స్తంభించాయి. రాజధాని గ్రామాల్లో 29 గ్రామాల పరిధిలో 2015 నుంచి 2019 వరకు మెట్ట భూమి ఎకరం రూ.కోటిన్నర వరకు పలకగా, 2020 నుంచి రూ.50 లక్షలకు కూడా కొనే నాథుడు లేడు. బహుళ పంటలు పండే జరీబు భూముల ధర ఎకరం రెండున్నర కోట్ల వరకు గతంలో పలకగా, ఇప్పుడు కోటి రూపాయలకు కూడా కొనే పరిస్థితి లేదు. 2015 నుంచి 2019 వరకు రాజధాని గ్రామాల్లో పెద్ద ఎత్తున రియల్ ఎస్టేట్ వ్యాపారం జరిగింది. ఆ సమయంలో భూముల క్రయవిక్రయాల ద్వారా ఏటా రూ.100 నుంచి రూ.150 కోట్ల వరకు ప్రభుత్వానికి ఆదాయం వచ్చింది. ఈ ఏడాది ఇంతవరకూ రూ.1.90 కోట్ల మాత్రమే ఆదాయం వచ్చింది. పరిపాలన రాజధాని మార్పు ప్రకటనలో 2019 డిసెంబర్ 17వ తేదీ నుంచి ఈ ప్రాంతంలో పూర్తిగా క్రయవిక్రయాలు నిలిచిపోయాయి. రిజిస్ట్రేషన్ కార్యాలయాలు వెలవెలబోతున్నాయి. గతంలో రోజుకు వంద నుంచి 300 వరకు జరిగిన రిజిస్ట్రేషన్లు, ఇప్పుడు రోజుకు ఒకటి కూడా జరగని పరిస్థితి నెలకొంది. రాజధాని ప్రాంతంలో రియల్ ఎస్టేట్ భారీగా జరుగుతున్న సమయంలో అదనంగా సబ్ రిజిస్టర్ కార్యాలయాలు నాలుగు, జిల్లా రిజిస్టర్ కార్యాలయం ఒకటి ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ కార్యాలయాలను ఉంచాలా? ఎత్తివేయాలా? అని అధికారులు ఆలోచిస్తున్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. చాలా రియల్ ఎస్టేట్ సంస్థలు ఈ ప్రాంతాన్ని ఖాళీ చేసి వెళ్లిపోయాయి. కొంతమంది బోర్డులు మార్చి ఇతర వ్యాపారాల వైపు దఅష్టి సారించారు. అమరావతిని అద్భుతంగా తీర్చిదిద్దుతామని అప్పటి టిడిపి ప్రభుత్వం చేసిన ప్రచారంతో 2015 నుంచి 2019 మధ్య భూములు, ప్లాట్లు కొనుగోలు చేసిన వేలాది మంది ఆశలు నేడు నీరుగారిపోయాయి. భూ సమీకరణలో రైతుల నుంచి 34,724 ఎకరాల భూములను గత టిడిపి ప్రభుత్వం తీసుకుంది. ఇందులో దాదాపు పది వేల ఎకరాల్లో 29 వేల మంది రైతులకు, భూ యజమానులకు 50,389 ప్లాట్లను కేటాయించింది. వీటిని అభివఅద్ధి చేసి మూడేళ్లలో అప్పగిస్తామని సిఆర్‌డిఎ చట్టంలో పేర్కొన్నా అమలుకు నోచుకోలేదు. వైసిపి ప్రభుత్వం పరిపాలన రాజధాని మార్పుపై దఅష్టి సారించి ఈ ప్రాంత అభివఅద్ధిని పట్టించుకోవడం లేదు.

# ముంపుపై కనిపించని ముందు చూపు

రాజమండ్రి, జూలై 23, (న్యూస్ పల్స్)గోదావరి ముంపుపై సర్కారుకు ముందు చూపు కరువైంది. పోలవరం కాఫర్ డ్యాం నిర్మాణ దశలో ఉండగానే గతేడాది వరదలకు అధికారుల అంచనాలకు మించి గ్రామాలు ముంపునకు గురవడంతో మొదటి కాంటూర్ పరిధి (41.15 మీటర్లు) లెక్కలన్నీ కాకి లెక్కలని తేలిపోయాయి. ప్రస్తుతం కాఫర్ డ్యాం పనులు దాదాపు పూర్తి కావడంతో బ్యాక్ వాటర్ ప్రభావంతో ముంపు ప్రమాదం నాలుగు రెట్లు పెరిగింది. భద్రాచలం వద్ద ప్రస్తుతం నమోదవుతోన్న 13.20 అడుగుల నీటిమట్టానికే దేవీపట్నం జలదిగ్బంధమైంది. ఆ లెక్కన మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి అంటే, 43 అడుగులకు చేరే సరికి అధికారుల అంచనాలను దాటి ముంపునకు గురయ్యే ప్రమాదం స్పష్టంగా కన్పిస్తోంది. ఈ నేపథ్యంలో ముందస్తుగా పక్కా ప్రణాళికలు రూపొందించి ముంపు బాధితులను రక్షించాల్సిన ప్రభుత్వ తాత్సారం చేస్తుండడంతో పోలవరం నిర్వాసితులు తీవ్ర ఆందోళనతో ఉన్నారు.మొదటి కాంటూర్ పరిధికి మించి గతేడాది గ్రామాలు ముంపు బారిన పడడంతో తాజా అంచనాలు రూపొందించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ముంపు గ్రామాలను గుర్తించేందుకు ఏరియల్ సర్వే నిర్వహిస్తున్నారు. గ్రౌండ్ లెవెల్‌లో పాయింట్లను ఏర్పాటు చేసినట్టు సమాచారం. ఈ సర్వే ఆధారంగా గుర్తించిన గ్రామాలను గత జాబితాలో పోల్చి తుది నివేదిక రూపొందించనున్నారు. ప్రస్తుతం ప్రాథమిక దశలో ఉన్న ఈ సర్వే పూర్తయ్యే సరికి రెండు నెలలు సమయం పట్టే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈలోగా వరదలు వచ్చే అవకాశం ఉంది.పోలవరం ప్రాజెక్టు కింద ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన ఎనిమిది మండలాల్లోని 373 గ్రామాల్లోని 1,05,601 కుటుంబాలు నిర్వాసితులవుతాయని అధికారులు అంచనా వేశారు. గతేడాది వరదలకు తూర్పుగోదావరి జిల్లాలో మొదటి కాంటూర్ 41.15 మీటర్ల పరిధిలోనిలేని గ్రామాలు సైతం ముంపు బారిన పడ్డాయి. కూనవరం మండలంలోని బజ్జరాయగూడెం మొదటి కాంటూర్ పరిధిలో ఉంది. ఈ పరిధిలోలేని టేకులబోరు, కూనవరం, శబరి కొత్తగూడెంతో పాటు 25 గ్రామాలు మునిగిపోయాయి. విఆర్‌పురం మండలంలోని 19 గ్రామాలను మొదటి కాంటూర్ పరిధిలో చేర్చారు. ఈ పరిధిలోలేని మరో 20 గ్రామాలకుపైగా నీటమునిగాయి. చింతూరు మండలంలోని నిర్వాసిత గ్రామాలను అసలు మొదటి కాంటూర్ పరిధిలో చేర్చలేదు. గతేడాది వరదలకు మండల కేంద్రంతో పాటు 20 గ్రామాలు ముంపుబారిన పడ్డాయి.మొదటి కాంటూర్ పరిధిలోని గ్రామాలు ముందుగా మునిగిపోతాయని, కాబట్టి ఆ గ్రామస్తులకు తొలుత పునరావాసం కల్పిస్తామని ప్రభుత్వం చెప్పుకొచ్చింది. జిల్లాలోని దేవీపట్నం మండలంలో తొలుత ముంపునకు గురయ్యే గ్రామాలు 44 ఉన్నాయి. బాధిత కుటుంబాలు 5,168 ఉండగా 3,055 కుటుంబాలకు మాత్రమే ప్యాకేజీ వచ్చింది. మరో 2,563 కుటుంబాలకు అందాల్సి ఉంది. ఇప్పటికి 17 గ్రామాలను మాత్రమే ఖాళీ చేశారు. 27 గ్రామాలవారు అక్కడే ఉంటున్నారు. విఆర్‌పురం మండలంలో 20, కూనవరం మండలంలోని ఒక గ్రామంతో మొత్తం 21 గ్రామాలు ముంపునకు గురికానున్నాయి. విఆర్‌పురంలోని 2,184 కుటుంబాలకు, కూనవరం మండలంలో 166 కుటుంబాలకు పునరావాసం కల్పించాల్సి ఉంది. అక్కడి ప్రజలు కొండలపై, గుట్టలపై తాత్కాలిక పునరావాసం ఏర్పాటు చేసుకుంటున్నారు.

# జాతీయ రహదారి బాధితులకు నష్ట పరిహారం చెల్లించాలి

పాడేరు జూలై 23, (న్యూస్ పల్స్)జాతీయ రహదారి గ్రీన్ ఫిలిడ్ రోడ్ బాధితులకు ఎటువంటి నష్టపరిహారం చెల్లించకుండా రోడ్ నిర్మాణం పనులు చేయడం సరికాదని తాత్కాలిక పనులు నిలుపుదల చేయాలని జాతీయ రహదారి భూసేకరణ అధికారి,పాడేరు సబ్ కలెక్టర్ అభిషేక్ గారికి విజ్ఞప్తి చేస్తూ గిరిజన సంఘం వినతిపత్రం సర్పించారు.పాడేరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ అభిషేక్ గారితో గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.అప్పలనర్స, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిల్లో సురేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.సూర్యనారాయణ, డుంబ్రి గూడ మండలం సిపిఎం కార్యదర్శి ఎస్.బి.పోతురాజ్ ఆధ్వర్యంలో సుమారు 10 గ్రామాల రహదారి బాధితులు కలిసి వినతి పత్రం అందజేశారు.గ్రీన్ ఫిలిడ్ నేషనల్ హైవే నిర్మాణం కోసం జనవరి2020లో నోటిఫికేషన్ జారీ చేశారు.21 రోజులోపాటు అభ్యంతరాలు రాతపూర్వకంగా ఇవ్వాలని నోటిఫికేషన్లో పేర్కొన్నారు. బాధితులు తెలిపిన అభ్యంతరాలపై నేటికి భూసేకరణ అధికారికంగా స్పందించలేదని,గ్రామసభ

**లేదంటే పనులు సాగనివ్వకుండా అడ్డుకుంటాము**

**గ్రామసభ ఆమోదం తీసుకోవాలి**

ఆమోదం లేకుండానే, కనీసం బాధితులకు సమాచారం కూడ ఇవ్వకుండానే జాతీయ రహదారి నిర్మాణం పనులు ముమ్మరంగా చేస్తున్నారని. నేటికి బాధితులు జాబితా ప్రకటన విడుదల చేయాలేదని, చాపరాయి నుండి రోడ్ మ్యాప్ మార్చాలని డుంబ్రి గూడ చుట్టుపక్కల గ్రామ ప్రజలు దరఖాస్తు చేసుకున్నప్పటికి నేషనల్ హైవే అదరిటీ వారు నిర్లక్ష్యంగా ఉన్నారని లేఖలో పేర్కునడం జరిగింది. జిరాయి భూమిని పోరంబోకు భూమిగా సర్వే అధికారులు తప్పుడు జాబితా తయారు చేయడం తో బాధితులు ఆవేదన వ్యక్తంచేశారు.ఆర్‌డబి రోడ్ సమీపంలో ఇల్లు,షాప్ నిర్మించిన గిరిజనులకు నష్టపరిహారం చెల్లించాలని,కించుమండ,డుంబ్రి గూడ గ్రామంలో రోడ్ వెడల్పు తగ్గించాలని కోరడం జరిగింది.దానికి సబ్ కలెక్టర్ స్పందిస్తూ నేషనల్ హైవే అదరిటీ వారికి లేఖ రాసి సమస్యలను పరిష్కరిస్తామని, గ్రామసభ నిర్వహిస్తామనిహామీ ఇచ్చారని తెలియ చేశారు.

# లింగాల మున్నేరు పై రాకపోకలు బంద్

విజయవాడజూలై 23, (న్యూస్ పల్స్)కృష్ణా జిల్లా వత్సవాయి మండలంలో లింగాల మున్నేరు పై నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహించే సమాచారంతో పోలీసులు రాకపోకలను నిలిపివేసారు. లింగాల మున్నేరు కాజ్వే పై ఇరుపక్కల భారీ గేట్లు ఏర్పాటు చేసారు. రాకపోకలను నిలుపుదల చేయటంతో 10 పైగా గ్రామాలకు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ప్రస్తుతానికి పెనుగంచిప్రోలు మున్నేరు కాజ్వే పై ప్రవహించడానికి మూడడుగుల మాత్రమే ఉంది. ఇది మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. పొలంపల్లి డ్యాం వద్ద 11 అడుగులు పై ప్రవహిస్తున్న వరద నీరు, 14 అడుగులకు చేరవచ్చని అంటున్నారు.

# పార్కింగ్ కోసం గ్రీన్ బెల్ట్ ను తవ్వేసారు

విశాఖపట్నం జూలై 23, (న్యూస్ పల్స్)మేయర్ కారు పార్కింగ్ కోసం గ్రీన్ బెల్ట్ లో జివిఎంసీ అధికారులు. పచ్చని చెట్లు కొట్టేవేయడం వివాదస్పదవుతోంది. ఇప్పటికే 150 మీటర్ల పొడవున తవ్వకాలు జరిపారు. పెదగలిలో నివాసం ఉంటున్న మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, తన నివాసాన్నే క్యాంపు కార్యాలయంగా మార్చుకున్నారు. మేయర్ నివాసానికి సమీపంలో బీఆర్టీఎస్ రోడ్డుకు, సర్వీస్ రోడ్డుకు మధ్యలో 10 మీటర్లు వెడల్పున గ్రీన్ బెల్ట్ వుంది. ఆ ప్రాంతాన్నే వాహనాల పార్కింగ్ కు కేటాయించాలని మేయర్ కుటుంబం కోరారు. దానికి వెనకాముందూ ఆలోచించకుండా అధికారులు 150 మీటర్ల పొడవున గ్రీన్ బెల్ట్ ను జేసీబీలతో తవ్వేసి లెవెల్ చేసారు. మేయర్ క్యాంపు కార్యాలయం కు వచ్చే వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా వున్నందున గ్రీన్ బెల్ట్ ను కొంచెం మార్పులు, చేర్పులు చేశారని మేయర్ అంటున్నారు. అయితే, గ్రీన్ బెల్ట్ తొలగింపు పైల్ తన వద్దకు రాలేదన్న మునిసిపల్ కమిషనర్ సృజన అంటున్నారు.

# షేక్ సైదాని, షేక్ ఖంతర్ అలీ లను ఘనంగా సన్మానించిన ముస్లిం మైనారిటీ నాయకులు

నెల్లూరు జూలై 23, (న్యూస్ పల్స్‌నెల్లూరు గ్రామీణ నియోజకవర్గ పరిధిలోని మాగుంట లేఔట్, హెచ్.ఎన్.ఆర్. కళ్యాణమండపంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ కార్పొరేషన్ ఛైర్పర్సన్ గా నియమితులైన సైదానిని మరియు జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ గా నియమితులైన షేక్ కంతర్ అలీ లను నెల్లూరు గ్రామీణ నియోజవర్గ ముస్లిం మైనారిటీ నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా పాల్గొన్న నెల్లూరు గ్రామీణ నియోజకవర్గ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం ఇంఛార్జ్ కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, నగర అధ్యక్షుడు తాటి వెంకటేశ్వర రావు, మాజీ మేయర్ భానుశ్రీ మరియు ఏఎంసీ చైర్మన్ యేసు నాయుడు పాల్గొన్నారు.ఈ సందర్భంగా

వారు మాట్లాడుతూ మొదటినుండి పార్టీకోసం మరియు స్థానిక ఎమ్మెల్యే గెలుపు కోసం కష్టపడి పనిచేసి, వైకాపా వెంట నడిచిన ప్రతి కార్యకర్తకు న్యాయం జరిగేలా కృషి చేయడం మానవతా దృక్పథం ఉన్నారు. వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీకి మొదటినుండి కష్టపడుతూ తనవంతు సహాయసహకారాలు అందించిన షేక్ రియాజ్ వారి సతీమణి సైదానికి మరియు కంతర్ అలీకి ఇటువంటి గొప్ప పదవులు రావడం అభినందనీయం అని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలను రాజ్యాధికారం వైవు నడిపిస్తూ కొత్త చరిత్ర సృష్టించిన ఘనత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. నెల్లూరు గ్రామీణ నియోజవర్గ లో పార్టీ బలోపేతానికి, ప్రజాసంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు గ్రామీణ నియోజకవర్గ కార్యాలయ ఇంచార్జ కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, నెల్లూరు గ్రామీణ నియోజవర్గ ముస్లిం మైనారిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ... టీడీపీ మధ్యలో రఘురామ

**ఆచితూచి కమలం అడుగులు**

విజయవాడ, జూలై 23, (న్యూస్ పల్స్)చంద్రబాబు నాయుడు మారతారని ఎవరూ అనుకోరు. తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో సీనియర్ నేత. ముఖ్యమంత్రిగానే కాదు, ప్రతిపక్ష నేతగానూ ఆయనదే రికార్డు. కానీ చంద్రబాబు ఎత్తుగడలు పాత చింతకాయ పచ్చడిని తలపిస్తున్నాయి. గతంలో తెలంగాణ ప్రభుత్వ విషయంలో తలదూర్చి బొప్పికట్టించుకున్నారు. తాజాగా వైసీపీ సర్కారును బద్నాం చేయడానికి అదే తరహా వ్యూహం రచిస్తున్నారంటూ రాష్ట్ర ప్రభుత్వం ఆరోపిస్తోంది. ఇది కేవలం రాజకీయ ఆరోపణ కాదు. సాక్షాత్తు సుప్రీం కోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్. చంద్రబాబు నాయుడు ఎంపీ రఘురామ కృష్ణ రాజుతో కుమ్మక్కై ప్రభుత్వాన్ని కూలదోయడానికి కుట్ర చేశారనేది ప్రభుత్వ ఆరోపణ. అయితే ఇక్కడ సర్కారు కూడా అనేక ప్రశ్నలకు సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుంది. రఘురామను రాజద్రోహం కింద అరెస్టు చేసేవరకూ చంద్రబాబు కుట్రను కనిపెట్టలేకపోయారా? మరి ఆ తర్వాత కూడా చంద్రబాబు నాయుడిపై ఆ కేసు ఎందుకు పెట్టలేదంటే సమాధానం దొరకదు. సొంత ఎంపీపై నమోదు చేసిన కేసును సమర్థించుకునేందుకు ప్రతిపక్ష నేతను వాడుకుంటున్నారనే వాదనా వస్తుంది. మొత్తం వ్యవహారాన్నికొలిక్కి తెచ్చేందుకు చంద్రబాబుతో రఘురామ జరిపిన మొబైల్ చాటింగ్ ను ఆదారంగా వాడుకోవాలనుకుంటోంది ప్రభుత్వం. ఇందులోని న్యాయకోణాలు, చట్టపరమైన సాక్ష్యాలు పక్కన పెడితే చంద్రబాబు నాయుడు ఆ తప్పు చేశారా? లేదా? అన్నది ప్రశ్నగా మిగులుతోంది.ఎంపీ రఘురామ విషయంలో చంద్రబాబు నాయుడు, తెలుగుదేశంపార్టీ బహిరంగంగానే మద్దతునిస్తున్నాయి. తమ అజెండాను సదరు ఎంపీ అమలు చేయడం పట్ల ప్రతిపక్ష నేత చాలా సంతోషంగా ఉన్నారు. ఇప్పటికిప్పుడు వైసీపీ సర్కారుకు వచ్చే ప్రమాదం ఏమీ లేదని తెలుసు. కానీ సాధ్యమైనంత వరకూ పబ్లిక్ లో జగన్ మోహన్ రెడ్డిని బద్నాం చేయడమే లక్ష్యం. పైపెచ్చు తెలుగుదేశం చేస్తున్న ఆరోపణలకంటే రఘురామ చేస్తున్న ఆరోపణలు , విమర్శలకే మీడియాలో ప్రచారం ఎక్కువగా లభిస్తోంది. అన్నిటికంటే ముఖ్యంగా వైసీపీ సర్కారు, జగన్ మోహన్ రెడ్డి ఆ విమర్శల పట్ల కుతకుతలాడిపోతున్నారు. ఆ విషయమే టీడీపీకి ఆనందం కలిగిస్తోంది. ప్రజాబాహుళ్యంలో తాము చేయలేకపోతున్న పనిని రఘురామ చేస్తున్నందుకు మురిసిపోతోంది. ఈ విషయంలో చంద్రబాబు మద్దతు మీడియా సహకారం అందరికీ తెలిసినవే. ఇవి ప్రజల్లోనూ చర్చకు దారితీస్తున్న బహిరంగ రహస్యాలు. దానిపై ఫోరెన్సిక్ ల్యాబ్ రిపోర్టుతో ఆధారాలు సేకరించాల్సినంత సీక్రెసీ ఏమీ లేదు.సుప్రీం కోర్టులో రాష్ట్ర ప్రభుత్వ వాదన విచిత్రంగానే కనిపిస్తోంది. జగన్ బెయిల్ రద్దు అంశంపై కోర్టులో పిటిషన్ వేసేముందు రఘురామరాజు చంద్రబాబు నాయుడిని సంప్రతించారనేది ఆరోపణ. ప్రభుత్వాన్ని కూలదోసే కుట్రగా, ఇదో పెద్దనేరంగా చూపించాలని ప్రభుత్వ సీఐడీ వర్గాలు తాపత్రయపడుతున్నాయి. దానివల్ల పెద్దగా ప్రయోజనం సమకూరదు. కోర్టు కేసు వివరాలను చంద్రబాబు నాయుడితో రఘురామ షేర్ చేసుకున్నారనేది నేరం కాదు. అయితే న్యాయపరంగా కేసు నిలబడక పోయినా , వైసీపీకి మాత్రం కచ్చితంగా ఒక ప్రయోజనం సమకూరుతుంది. ఇటువంటి లోపాయి కారీ వ్యవహారాలు నడపటంలో చంద్రబాబు ఇమేజ్ ను ప్రజాక్షేత్రంలో దెబ్బతీయవచ్చు. టీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటుకు నోటు కేసులో గతంలోనూ చంద్రబాబు ఇన్ వాల్వ్ మెంట్ రాజకీయ రచ్చకు దారి తీసింది. ప్రతిపక్షంగా పొలిటికల్ ఫైట్ చేయాల్సిన టీడీపీ వెన్నుపోటు దారులను అడ్డుపెట్టుకుని గూడుపుఠాణి చేస్తోందనే అనుమానాలు ప్రజల్లోకి పంపడానికి ఆస్కారం ఏర్పడింది.కోర్టులో తమ కేసు మరీ బలహీనంగా వీగిపోకుండా ప్రమాణ పత్రం దాఖలు చేసింది ప్రభుత్వం. మొబైల్ చాటింగ్ లను కుట్రకు ఆధారంగా చూపించింది. ఇది న్యాయ, చట్టపరమైన ప్రమాణాలకు సరితూగదు. పోనీ కేంద్రం ఏమైనా జోక్యం చేసుకుంటుందా? అంటే చూస్తూ మౌనం వహిస్తుంది. టీడీపీ, వైసీపీలు స్వయంక్రుతాపరాధాలతో భ్రష్టు పట్టిపోవాలనేది బీజేపీ దూర ద్రుష్టి. జగన్, చంద్రబాబు నాయుడు పరస్పర కలహాలతో నాశనమైతే , తమ పార్టీకి ఏపీలో ఎంతోకొంత ఆదరణ లభిస్తుందనే దింపుడు కళ్లెం ఆశతో ఎదురుచూస్తుంది బీజేపీ. అందుకే రఘురామ విషయంలో వైసీపీ ప్రతిష్ఠాత్మక పోరాటం చేస్తున్నప్పటికీ ఆయన పదవిపై వేటు పడకుండా కాపాడుతోంది. జగన్, చంద్రబాబు నాయుడుల విషయంలోనూ కేంద్రం తటస్థ పాత్ర పోషిస్తుంది. ఎవరు చట్టపరంగా ఇరుక్కున్నా కేంద్రం రక్షించదు. తమకు సంబంధం లేదన్నట్లుగానే వ్యవహరిస్తుంది. చంద్రబాబు నాయుడు కేసుల్లో ఇరుక్కుంటే రక్షించేవారు కూడా ఎవరూ లేరు. అదే సమయంలో జగన్ బెయిల్ రద్దయినా పట్టించుకోదు. గతంలో తెలంగాణ ప్రభుత్వంతో ఓటుకు నోటు వివాదం తలెత్తినప్పుడు బీజేపీ పెద్దలు జోక్యం చేసుకుని చంద్రబాబు, కేసీఆర్ ల మధ్య సర్దుబాటు చేశారు. ఇప్పుడు ఆ ఫెసిలిటీ చంద్రబాబుకు ఉండదు. పక్కా ఆధారాలతో వైసీపీ కేసులు పెడితే తప్పించుకో?వడం సాధ్యం కాదు. ఆధారాలు లేకుండా పిల్లల ఆరోపణల తరహాలో అఫిడవిట్లు వేస్తే లాభమూ ఉండదు. చంద్రబాబు నాయుడు కూడా తన రాజకీయ అనుభవాన్ని ప్రజాసమస్యలు, క్షేత్ర స్థాయి పోరాటాలపై పెడితే మంచిది. రఘురామ ఉదంతం వంటి చిల్లర వ్యవహారాలకు తన తెలివి తేటలను వినియోగించడం పరువు తక్కువ. ప్రజాబలం లేనివాళ్లే ఇటువంటి అడ్డగోలు లక్ష్యాలను ఎంచుకుంటారనే ముద్ర పడితే తెలుగుదేశం భవితవ్యానికే ప్రమాదం.

# దాతల సాయం కోసం ఎదురు చూస్తున్న ఓ నిరుపేద కుటుంబం..



కుక్కునూరు జూలై 23, (న్యూస్ పల్స్)ప్రార్థించే పెదవులకన్నా సాయం చేసే చేతులు మిన్నా అంటారు..రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబం వారిది.. చాలి చాలని కూలీ డబ్బులతో జీవనం సాగిస్తున్నారు.. ఇంతలోనే వారి కుటుంబాన్ని విధి వక్రీకరించింది? ఇంటికి పెద్దదిక్కైన భర్త పాముకాటుతో మరణించి నెల రోజులు కూడా కాలేదు అంతలోనే పాప కంటి చూపు పోగొట్టుకొని ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న సంఘటన కలచివేస్తుంది. ఈ హృదయ విధారకమైన సంఘటనపై 'ఉదయం న్యూస్' అందిస్తున్న ప్రత్యేక కథనం?పశ్చిమగోదావరి జిల్లా కుక్కునూరు మండలం గొమ్ముగూడెం గ్రామానికి చెందిన మరపాక అదిలక్ష్మి, కుమారస్వామి దంపతులు తమ చిన్నారి సారిక(8)తో కలిసి నివాసం ఉంటున్నారు. ఇంట్లో భార్య భర్తలు ఇద్దరు కలిసి కూలీ పని చేసుకుంటూ జీవనం సాగించేవారు.ఎంతో సంతోషంగా సాగిపోతున్నందునుకునే సమయంలో కుమారస్వామి ఈ నెల ఒకటో తారీఖు న పాముకాటుకి గురై మరణించాడు.ఇంటికి పెద్దదిక్కైన కుమారస్వామి మరణించడంతో ఒక్కసారిగా ఆ కుటుంబం కష్టాల కడలిలోకి

**కుటుంబానికి భారంగా మారిన వైద్య ఖర్చులు..**

**ఎడమ కంటిని పూర్తిగా కోల్పోయిన చిన్నారి..**

వెళ్ళిపోయింది. గొమ్ముగూడెం గ్రామం గోదావరి తీరప్రాంతం కావడంతో రానున్న గోదావరి వరదల దృష్ట్యా గొమ్ముగూడెం గ్రామస్తులను రావి కుంట గ్రామంలో గిరిజనులకు నిర్మించిన ఆర్ అండ్ ఆర్ పునారావాసా కాలానికి అధికారులు తరలించారు. పునరావాస కాలనీ వద్ద ఎనిమిదేళ్ల సారిక స్నేహితులతో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు ఈ నెల 18 తారీఖున ఇనుప రాడ్డు పై పడడంతో ఇనుప రాడ్డు ఎడమ కంటికి గుచ్చుకొని కంటి గుడ్డు కారిపోవడంతో చిన్నారి ఇనుప రాడ్డు గుచ్చుకొని ఆడుకునే వయసులోనే ఒక కన్ను కోల్పోయిన సారికని హైదరాబాద్ లోని ఎల్వి ప్రసాద్ ఆకంటి ఆసుపత్రికి తీసుకెళ్లామని స్థానికులు చెప్పడంతో అందినకాడల్లా అప్పులు చేసి,చివరకు ఒంటిపై ఉన్న బంగారం అమ్మిలక్ష యాభై వేల రూపాయలతో హైదరాబాదులోని ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రి (ప్రవేట్ హాస్పిటల్)లోఆపరేషన్ చేయించమని, ఎడమ కంటిని పూర్తిగా కోల్పోయి హైదరాబాదులోని ప్రవేట్ కంటి హాస్పిటల్లో ఉన్నమని ఖర్చులకి డబ్బులు లేవని, కుడి కంటికి కూడా ఇన్ఫెక్షన్ అవుతుందని అలా జరగకుండా ఉండాలంటే ట్రీట్మెంట్ చేయాలని వైద్యులు చెబుతున్నారని తమకు కుటుంబానికి అంత స్తోమత లేదని సారిక తల్లి అప్పటి నుండి తీవ్రశోకంలో మునిగిపోయారు. అప్పటికే లక్షన్నర అప్పు చేసి సారికకు వైద్యం అందిచమని వైద్యఖర్చుల కోసం ఉపయోగించామని, సుమారుగా రూ.2.5 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారని, దీంతో బీదకుటుంబం కావడంతో వైద్య ఖర్చులు కుటుంబానికి భారంగా మారాయని దిక్కుతోచని స్థితిలో బాధితురాలి తల్లి కన్నీరుమున్నిరుగా విలపిస్తుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తన కూతురి వైద్యం కోసం అయ్యే ఆర్థిక సహాయం అందించాలని బాధితురాలి తల్లి ఆదిలక్ష్మి వేడుకుటుంది. దాతలు ఎవరైనా ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందించి తన కూతురిని కాపాడాలని వేడుకుంటుంది. దాతలు అపన్న హస్తం అందిచాల్సిన వివరాలు, యూనియన్ బ్యాంక్, కుక్కునూరు బ్రాంచ్, అకౌంట్ నెంబర్- 201910100106851, ఐఎఫ్ఎస్‌సి కోడ్ నెంబర్ యు.బి.ఐ. ఎన్.0820199, ఫోన్ ఫే నెంబరు 8309181423 కు పంపిచగలరు.

# కలెక్టరేట్ ఎదురుగా గిరిజన సంఘం నాయకుల అర్ధనగ్న ప్రదర్శన

నెల్లూరు జూలై 23, (న్యూస్ పల్స్)ఐటీడీఏ పీవోను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ గత 13 రోజులుగా యానాదుల గిరిజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట అర్ధనగ్న ప్రదర్శన, మోకాళ్లపై నిలబడి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు వారాలుగా ఐటీడీఏ పీవో మణికుమార్ పై విచారణ జరిపి సస్పెండ్ చేయాలని ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ అధికారులు స్పందన కరువైందన్నారు. శనివారం నుండి ఆందోళన ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా యానాదుల సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు తలపల ప్రభాకర్ మాట్లాడుతూ యానాదులు గత 13 రోజులుగా ఆందోళనా చేస్తున్నా జిల్లా అధికార యంత్రాంగం స్పందించకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఐటీడీఏ పీవో మణికుమార్ అవినీతి అక్రమాలపై విచారణ జరిపించి చట్ట రీత్యా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగాసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెసి పెంచలయ్య మాట్లాడుతూ శనివారం నుండి అధునాతన పద్ధతిలో ఆందోళనా కార్యక్రమాలను ఉధృతం చేస్తామని అధికారులకు రిలే దీక్షలు ద్వారా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బి ఎల్ శేఖర్, ప్రధాన కార్యదర్శి రాపూరు కృష్ణయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఇండ్ల రవి, యువజన విభాగం అధ్యక్షులు యల్లంపల్లి రమేష్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఇండ్ల మల్లి, మహిళా నాయకురాలు చెంబేటి ఉష, చెంచురామయ్య, మానికల మురళీ, గిరిజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఏకోల్లు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# నీట మునిగిన పంటపోలాలు

ఆచంట జూలై 23, (న్యూస్ పల్స్)గత రెండు రోజులుగా భారీగా కురుస్తున్న వర్షాలకు అన్నదాతలు అపార నష్టాన్ని చవిచూస్తున్నారు. వేలాది ఎకరాల్లో వేసిన తొలకరి నారుమడులు పూర్తిగా నీట మునిగాయి. పొలాలు ముంపు నీటి బారిన పడడంతో పరిస్థితి దారుణంగా మారింది. కొద్దిపాటి వర్షానికే మేజర్, మైనర్ డ్రెయిన్లలో నీటి ప్రవాహం ఎక్కడికక్కడే స్తంభించిపోవడంతో చాలా గ్రామాల్లో ముంపు ముప్పు తీవ్రమైంది. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గం పెనుమంట్ర, పోడూరు,ఆచంట ,పెనుగొండ మండలాల్లో వివిధ ప్రాంతాల రైతులు నారుమడులు సిద్ధం చేసుకున్నారు. కొన్ని చోట్ల నారుమడులు ఏపుగా పెరిగినప్పటికీ మరికొన్ని చోట్ల మొలక దశలో ఉన్నాయి.ఆచంట సుమారు 680 ఎకరాల్లో వరి సాగవుతోంది. ఇందుకోసం రైతులు 150 ఎకరాల్లో నారుమడులను సిద్ధం చేయవలసి ఉండగా ఇప్పటివరకు 120 ఎకరాల్లో నారుమడు లు వేశారు. వాస్తవానికి జూలై నెలాఖరు నాటికి ఖరీఫ్ నాట్లు పూర్తి కావలసి ఉంది. జూన్ 15న కాల్వ లకు నీటిని విడుదల చేయడం, వాతావరణ పరి స్థితులు సానుకూలంగా లేకపోవడంతో రైతులు నారుమడులు వేయడంలో జాప్యం జరిగింది.జూన్ నెలాఖరు నుంచి ఎక్కడికక్కడే నారుమడులను సిద్ధం చేసుకుంటున్న తరుణంలో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దాని కారణంగా వేసిన 120 ఎకరాల నారుమడులన్నీ పూర్తిగా నాశనమవుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి తమని అన్నివిధాలా ఆదుకోవాలని కోరుతున్నారు.

# పార్టీ అడ్డాగా ఆంధ్రా యూనివర్సిటీ

విశాఖపట్నం జూలై 23, (న్యూస్ పల్స్)ఆంధ్రా యూనివర్సిటీ విశ్రాంత టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులకు చెల్లించవలసిన సుమారు ఎనిమిది కోట్లు రూపాయలు బకాయిలు తక్షణమే చెల్లించాలని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటీశ్వర రావు డిమాండ్ చేశారు. విశాఖ సిఐటియూ కార్యాలయం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. యూనివర్సిటీని రాజకీయ పార్టీ అడ్డాగా మార్చేశారని ,ప్రశ్నిస్తే భయ బ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రా యూనివర్సిటీ కి చెందిన వేల కోట్లు విలవ చేసే భూములు వివరాలు సేకరిస్తున్నారని వివరించారు. ఏయూ లో జరిగే అన్యాయాలపై విద్యార్థులు ఆందోళన చేసే పరిస్థితి లేదన్నారు. దీనిలో భాగంగానే వీసీ కార్యాలయం వద్ద అంచెల భద్రత ఏర్పాటు చేశారన్నారు.గతంలో వలే యూనివర్సిటీ లోకి యధేచ్ఛగా వెళ్లే పరిస్థితులు లేవని వాపోయారు.

# టీడీపీ నిరసన

విశాఖపట్నం జూలై 23, (న్యూస్ పల్స్)నిత్యవసర సరుకులు, వంట గ్యాస్ ధరలు పెరగుదల ను నిరసిస్తూ విశాఖ టీడీపీ ప్రధాన కార్యాలయం వద్ద మహిళా విభాగం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. జగన్ రెడ్డి పాలన నశించాలి, ధరలు తగ్గించాలి అంటూ నినాదాలు చేశారు. కర్రల పొయ్యి పై వంట చేసి నిరసన తెలిపారు. ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం టీడీపీ పార్లమెంటు విభాగం మహిళా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంత లక్ష్మి మాట్లాడుతూ ధరల దరువు, బ్రతుకు బరువు లా వుందని ఆవేదన వ్యక్తం చేశారు . గ్యాస్ ధర 920/- , నూనె ధర రెండు వందలు నిత్యవసర సరుకులు అన్ని ఆకాశాన్నంటుతుంటే ఎలా బ్రతకాలి అని ప్రశ్నించారు. బ్రతకాలంటే భయం వేస్తోంది.

## ఆళ్లగడ్డలో ఉపాధ్యాయ సంఘాల ధర్నా




ఆళ్లగడ్డ :: (విభారె న్యూస్):: జూలై 23 :: ఈరోజు ఆళ్లగడ్డ పట్టణంలో ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం జరిగినది. రాష్ట్ర ఎన్జీవో సంఘం ఉపాధ్యక్షుడు వంగల దస్తగిరి రెడ్డి మాట్లాడుతూ, కొత్త ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయినప్పటికీ ఉపాధ్యాయుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్లుగా ఉందని, పిఆర్సి, డిఏ, సిపిఎస్ రద్దు మరియు ఇతర ప్రధాన సమస్యలపై, ఎన్నిసార్లు చర్చలు జరిపినప్పటికీ పరిష్కారం కానందున ఈరోజు ధర్నా నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టియు స్టేట్ సెక్రటరీ బి శ్రీనివాసులు, యు టి ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఐజయ్య, యుటిఎఫ్ డిస్ట్రిక్ట్ సెక్రటరీ పి ఆర్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## శిరివెళ్ల లో నిర్మాణ పనులను వేగవంతం చేయండి

### : నంద్యాల సబ్ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

శిరివెళ్ల :: జులై 23 ( విభారె న్యూస్):: శిరివెళ్ల మండలం పరిధి లో నిర్మిస్తున్న గ్రామసచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల భవనాలు, వై యస్ ఆర్ హెల్త్ క్లినిక్ భవనాలు,పాల శీతల కేంద్రాల భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని నంద్యాల సబ్ కలెక్టర్ చహత్ బాజ్ పాయ్ సంబంధిత అధికారులను ఆదేశించారు.



శుక్రవారం ఉదయం శి రివెళ్ల మండలకేంద్రం మరియు మండల పరధిలోని ఖాదర్ ఖాదర,గుండంపాడు గ్రామాలలో శిరివెళ్ల తహసీల్దార్ మాధవ, మండల అభివృద్ధి అధికారి సల్మాన్ రాజు, పంచాయితీ రాజ్-ఆజు కమల్, పంచాయతీ రాజ్ ఐజు లక్ష్మీ నరసింహులు లతో కలసి ప్రభుత్వ భవనాల నిర్మాణం పనులను పరిశీలించారునినంద్యాల సబ్ కలెక్టర్ కుమారి చహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం నంద్యాల రెవెన్యూ డివిజన్ శిరివెళ్ల మండల పరిధిలోని శిరివెళ్ల మండల కేంద్రం,ఖాదర్ భాదర గ్రామము,గుండంపాడులో నిర్మాణం పనులను పరిశీలించామని, భవనాల నిర్మాణం పనులలో ఆలసత్వం చేయకుండా వేగవంతంగా పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ అధికారులను ఆదేశించామని అన్నారు .వీరి వెంట సచివాలయ సిబ్బంది,పంచాయతీ రాజ్ కార్యాలయం సిబ్బంది, మండల సర్వేయరు తదితరులు ఉన్నారు.

## పెండింగ్లో ఉన్న సిసి రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టాలని మున్సిపల్ కార్యాలయం ముందు సిపిఐ ధర్నా

ఎమ్మిగనూరు జూలై 23, (విభారె న్యూస్):)ఎమ్మిగనూరు పట్టణంలో పలు వార్డుల్లో పెండింగ్లో ఉన్న సిసి రోడ్లు డ్రైనేజి నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతూ సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టడం జరిగిందీ. ఈ కార్యక్రమానికి సీపీఐ తాలూకా సమితి సభ్యులు విజేంద్ర అధ్యక్షతన జరిగింది ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి కె.తిమ్మగురుడు, తాలూకా సహాయ కార్యదర్శి బీటీ చిన్నన్న, ఏఐటియుసి తాలూక కార్యదర్శి బాలరాజులు,లు తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని అనేక వార్డుల్లో సిసి రోడ్లు డ్రైనేజీ నిర్మించడంలో పూర్తిగా వైఫల్యం చెందారు. ముఖ్యంగా వర్షాకాలం వస్తే కంకర తేలి గుంతల ఏర్పడడంతో ప్రజలు తిరగలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అదేవిధంగా పలు వార్డుల్లో డ్రైనేజీ సమస్య అస్తవ్యస్తంగా ఉందని వర్షాకాలం వచ్చిందంటే డ్రైనేజ్ నుంచి ఇళ్లల్లోకి వస్తున్నాయని వారు తెలిపారు. ఎమ్మిగనూరు పట్టణం గ్రేడ్ వన్ మున్సిపాలిటీ అయినప్పటికీ అభివృద్ధిలో మాత్రం అట్టడుగు స్థానంలో ఉందని వారు తెలిపారు. మున్సిపాలిటీ పనుల విషయంలో వంతంగా ముక్కుపిండి పన్ను వసూలు చేస్తున్నా అభివృద్ధిలో మాత్రం ఆమడ దూరంలో నిలిచిపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో మైనారిటీ కాలనీ, శివనగర్, రాఘవేంద్ర కాలనీ, కబరిస్తాన్ కొట్టాలా, సంజీవయ్య నగర్ సర్వేపల్లి రాధాకృష్ణ కాలనీ, బుడగ జంగాల కాలనీ,లక్ష్మి పేట, ఆర్టీసీ కాలనీ, తదితర వార్డుల్లో సిసి రోడ్లు డ్రైనేజీలు వేయకుండా మధ్యలో ఆపి వేయడం జరిగిందని,మరిముఖ్యంగా విద్యుత్ వ్యవస్థ, తాగునీరు తీవ్రంగా ఉందని కాబట్టి ఇ ఈ సమస్యలను పరిష్కరించడానికి మున్సిపల్ కమిషనర్ ప్రత్యేక చొరవ తీసుకుని పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముట్టడి చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ప్రజాసంఘాల నాయకులు మల్లికార్జున గౌడ్,కాజా, హనుమంతు, నరసింహులు,మురళి,రవి, తిమ్మప్ప, ప్రకాష్, చిన్న రాముడు, సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## ఫ్యాప్టో ఉపాధ్యాయుల ధర్నా విజయవంతం

డోన్ జూలై 23, (విభారె న్యూస్):)డోన్ లో జరిగిన ఫ్యాప్టో ఉపాధ్యాయుల ధర్నా విజయవంతం అయిందని ఫ్యాప్టో ఉపాధ్యాయుల సంఘం నాయకులు అన్నారు, స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ ఉఫాధ్యాయ సంఘాల సమైక్య (ఫ్యాప్టో)ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం డోన్ తాలూకా ఫ్యాప్టో చైర్మన్ యన్ యస్ బాబు అధ్యక్షతన ధర్నా ను నిర్వహించారు, కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(యఫ్ ఏ పి టి ఓ) ఆధ్వర్యంలో డోన్ తాలూకా ప్యాప్టో చైర్మన్ ఎన్.ఎస్.బాబు అధ్యక్షతన జరిగిన ధర్నా కార్యక్రమంలో యన్ యస్ బాబు మాట్లాడుతూ36 నెలలు గడుస్తున్నా పి ఆర్ సి ఊసే లేదు,6 విడతల కరువు భత్యం బకాయిలు పెండింగ్ లో ఉన్నాయి, అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సి పి యస్ విధానాన్ని రద్దు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచినా కూడా సి పి యస్ రద్దు అనే మాట హామీ గానే మిగిలిపోయింది. పరిస్థితిలో కూడా రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్లుగా లేదు,నూతన విద్యావిధానం 2020 పేరుతో ప్రాథమిక పాఠశాల వ్యవస్థని నిర్వీర్యం చేసత్తూ అంగన్వాడీ పాఠశాలలను ధ్వంసం చేయబోతున్నారని అన్నారు,యుటీఎఫ్ రాష్ట్ర పూర్వ గౌరవాధ్యక్షులు నరసింహుడు మాట్లాడుతూఅపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ధర్నా నిర్వహించబోతున్నాము,చాలా తక్కువ సంఖ్యలో ఉపాధ్యాయ మిత్రులు ఉద్యమాలకు హాజరు అవుతున్నారు,దీనివల్ల ప్రభుత్వాలు కూడా మన యొక్క ఉద్యమాలను టీ కప్పులో తుఫాన్ లాగా కొట్టి పడేస్తున్నాయి,ఉద్యమాలను చీల్చి ఉద్యోగ,ఉపాధ్యాయ సంఘాలను చీల్చి మన యొక్క ఉద్యమాలను నిర్వీర్యం చేస్తున్నాయి.. ఈ ప్రభుత్వాలు,ఇప్పటికైనా మనం మేలుకొని స్పందించక పోతే భవిష్యత్తులో మన యొక్క హక్కులు మరిన్ని కోల్పోవాల్సి వస్తుందన్నారు,ఈరోజు దాదాపు 200 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నందుకు హర్షం వ్యక్తం చేశారు, ఎస్టీయు రాష్ట్ర పూర్వ అధ్యక్షులు షణ్మూర్తి మాట్లాడుతూ కేవలం సంఘాలకు చందాలు కట్టడం వల్లనే

### ఉఫాధ్యయ సంఘాలు

సమస్యలు పరిష్కారం కావు,జన సమీకరణ ఉండాలి,ఎక్కువ మంది పాల్గొనాలి,ఉపాధ్యాయుల దెబ్బ ప్రభుత్వాల అబ్బ అనే విధంగా మన ఉద్యమాలు ఉండాలన్నారు, ఫ్యాప్టో కన్వీనర్ వెంకట సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జనవరి 1 న జాబ్ కాలెండర్ ప్రకటిస్తామని, ఉపాధ్యాయుల పోస్టులభర్తీ పూర్తి స్థాయిలో చేస్తామని ఇంతవరకు ఆ ఊసే లేకుండాపోయిందన్నారు, ప్యాప్టో మరొక కన్వీనర్ వెంకట రమణ మాట్లాడుతూ అన్ని యాజమాన్యాలలోని పాఠశాలల్లో నెలవారీ పదోన్నతులు చేపట్టాలన్నారు, మహిళా కన్వీనర్ గ్రేసమ్మ మాట్లాడుతూ 3,4,5 తరగతులను ప్రాథమిక పాఠశాల నుంచి విడగొట్టడం మంచిది కాదన్నారు, మాణిక్యం శెట్టి మాట్లాడుతూ పిఆర్సి నివేదికను వెంటనే బహిర్గత పరిచి 1.7.2018 నుంచి అమలుచేయాలన్నారు, ప్రధానోపాధ్యాయుడు సురేష్ బాబు మాట్లాడుతూ నిలుపుదల చేసిన 6 డి.ఏ.లను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు, నరసింహారెడ్డి మాట్లాడుతూ సి.పి.ఎస్.ను వారంలో రద్దు చేస్తామని చెప్పి ఇంతవరకు ఆ ఊసే లేకుండా పోయిందన్నారు,ఈ ధర్నా కార్యక్రమంనకు మునిసిపల్ కౌన్సిలర్ సుంకయ్య, పెన్సనర్ సంఘం గౌరవ అధ్యక్షుడు హనీఫ్, అధ్యక్షుడు భాను సింగ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మురళి కృష్ణ, మద్దిలేటి,సి.ఐ.టి.యు. తరుపున శివరాం, సంఘీభావం తెలిపారు. బి.వై.సుబ్బారాయుడు, చిన్నపురెడ్డి, రామ్మూర్తి,నాగన్న, బొజ్జన్న, వెంకట నాయక్, లతీఫ్, హుస్సేన్, మౌలాలి, లక్ష్మి దేవి, లక్ష్మి కాంతరెడ్డి, శివప్రసాద్, శంషాద్ బేగం, రాధ, శివ శంకరయ్య, శ్రీనివాస్ కుమార్, జానకిరాం, రమేష్,రాందాస్, రఘునాయక్,విశ్వనాథ్, అంజనప్ప,పాపారాయుడు, భాస్కర్ రెడ్డి, చంద్రమౌళి, వెంకటేశ్వర్ గౌడ్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, నూర్జహాన్, మద్దిలేటి, సుంకన్న, రామాంజనేయులు,నందప్ప, శివుడు, భారతి,భాస్కర్,తదితరులు, డోన్,ప్యాపిలి,క్రిష్ణగిరి, వెల్దుర్తి,బేతంచెర్ల మండలాల నుండి దాదాపు 200 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తిరుమలలోని పలు ప్రాంతాల్లో ఈవో తనిఖీలు

తిరుమల జూలై 23, (విభారె న్యూస్): టిటిడి ఈవో డాక్టర్ కెఎస్.జవహర్‌రెడ్డి శుక్రవారం తిరుమలలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. గతంలో తనిఖీల సందర్భంగా సూచించిన పలు పనుల ప్రగతిని పరిశీలించారు. అనంతరం ఈవో మీడియాతో మాట్లాడుతూ తిరుమలలో ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో పచ్చదనం పెంచి భక్తులకు ఆహ్లాదకరంగా ఉండేలా తీర్చిదిద్దేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దక్షిణ మాడ వీధిలో పచ్చదనం పెంచేలా, అవసరమైన ఇతర ప్రాంతాలు, కాటేజీల మధ్యభాగంలో ఉద్యానవనాలు పెంచేలా చర్యలు చేపట్టామని తెలిపారు. భక్తులు నడిచే ఫుట్‌పాత్‌లలో విరిగిన టైల్స్ స్థానంలో కొత్తవి ఏర్పాటు, భక్తులు కూర్చునేందుకు బెంచీలు ఏర్పాటుకు ఆదేశించామన్నారు. శ్రీవారికి అవసరమయ్యే పుష్పాలను తిరుమలలోనే పండించేందుకు కార్యాచరణ రూపొందించామని, ఇందుకోసం పలువురు దాతలు కూడా ముందుకొస్తు న్నారని చెప్పారు. శ్రీవారికి నైవేద్యానికి, దీపారాధన కోసం దేశీయ ఆవునెయ్యిని ఇక్కడే తయారుచేసేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. టిటిడి ఆలయాల్లో వినియోగించిన పుష్పాలను మరుసటి సేకరించి తిరుపతిలోని గోశాలలో అగరబత్తీలు తయారుచేసేందుకు చర్యలు చేపట్టామని, ఆగస్టు 15 నాటికి కొన్ని ఉత్పత్తులను విడుదల చేస్తామని చెప్పారు. ఈ అగరబత్తీలను తిరుమలలో కౌంటర్లు ఏర్పాటుచేసి భక్తులకు విక్రయిస్తామని, ఇందులో వచ్చే లాభాన్ని గోసంరక్షణకు వినియోగిస్తామని వివరించారు. అంతకుముందు బూందీ పోటులో శనగపిండి మిక్సింగ్, బూందీ తయారీ, థర్మోఫ్లూయిడ్ స్టౌలను ఈవో పరిశీలించారు. అదేవిధంగా జిఎన్‌సి టోల్‌గేట్, సైనిక్ నివాస్, లడ్డూ కౌంటర్లు, గోశాల, నిర్మాణంలో ఉన్న పరకామణి భవనాన్ని పరిశీలించారు. నారాయణగిరి ఉద్యానవనాల్లో వ్యర్థాలను తొలగించాలని అధికారులకు సూచించారు. శ్రీవారిమెట్టు మార్గం లో పల్లపు ప్రాంతాల్లో ఉద్యానవనాలు పెంచాలన్నారు. ఏఎన్‌సి ప్రాంతంలో వర్షపునీరు నేరుగా ఉద్యానవనాల్లోని చెట్లకు చేరేలా ఏర్పాటు చేయాలన్నారు.

## మహాపూర్ణాహుతితో ముగిసిన పవిత్రోత్సవాలు

తిరుపతి :: జూలై 23 ( విభారె న్యూస్):: శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన పవిత్రోత్సవాలు శుక్రవారం మహాపూర్ణాహుతితో ముగిశాయి. కోవిడ్ - 19 వ్యాప్తి నేపథ్యంలో ఈ కార్యక్రమాలను ఆలయంలో ఏకాంతంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం మూలవర్లకు అభిషేకం, మహాపూర్ణాహుతి, పవిత్ర సమర్పణ నిర్వహించారు. అనంతరం స్వామివారికి ధూపదీపనైవేద్యాలు సమర్పించారు. సాయంత్రం పంచ మూర్తులకు ఆస్థానం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో శ్రీ సుబ్రమణ్యం, సూపరింటెండెంట్ శ్రీ భూపతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీ రెడ్డిశేఖర్, శ్రీ శ్రీనివాస నాయక్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## 'నారప్ప' సినిమా నేపథ్యంలో తెలుగు , తమిళ ఫ్యాన్స్ ట్విట్టర్ వార్..!



విక్టరీ వెంకటేష్ హీరోగా శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ థ్రిల్లర్ మూవీ “నారప్ప”. కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ – వెట్రిమారన్ కాంబోలో రూపొందిన బ్లాక్ బస్టర్ 'అసురన్' చిత్రానికి ఇది అధికారిక తెలుగు రీమేక్. వి క్రియేషన్స్ మరియు సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్స్ పై కలైపులి ఎస్.థాను – సురేష్ బాబు కలసి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమా ప్రముఖ ఓటీటీ ఫ్లాట్ ఫార్మ్ అమెజాన్ ప్రైమ్ వేదికగా పేక్షకుల ముందుకు వచ్చింది. థియేటర్స్ లో రిలీజ్ చేయడానికి పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మేకర్స్ తెలిపారు. ఏదైతేనేం సమ్మర్ లో వెండితెరపై విడుదల అవ్వాల్సిన 'నారప్ప' చివరకు చిన్న తెరపైకి వచ్చింది. ఇప్పటికే రీమేక్ చిత్రాలతో ఎన్నో సూపర్ హిట్స్ అందుకున్న వెంకీ.. 'నారప్ప' సినిమాతో మెప్పించారని తెలుగు ఆడియన్స్ అంటున్నారు. వేర్వేరు షేడ్స్ ఉండే పాత్రలో జీవించారని.. ఎమోషన్ పండించారని మెచ్చుకుంటున్నారు. అదే సమయంలో 'అసురన్' ని 'నారప్ప' రీచ్ అవ్వలేకపోయాడని తమిళ ప్రేక్షకులు కామెంట్స్ చేస్తున్నారు. అమెజాన్ లో 'నారప్ప' స్ట్రీమింగ్ స్టార్ట్ అయినప్పటి నుంచి సోషల్ మీడియాలో దీని గురించే తెలుగు – తమిళ ఆడియన్స్ మధ్య కామెంట్ల వార్ జరుగుతోంది. 'అసురన్' ని మక్కీకి మిక్కీ దించినా ఇంపాక్ట్ క్రియేట్ చేయలేకపోయారని.. ధనుష్ ని వెంకటేష్ మ్యాచ్ చేయలేకపోయాడని తమిళ ఫ్యాన్స్ నెగెటివ్ కామెంట్స్ చేస్తున్నారు. దీనికి వెంకటేష్ తన వయసుకు తగిన పాత్రలో అదరగొట్టాడని.. కొన్ని సన్నివేశాల్లో ధనుష్ ని మరిపించారని.. తమిళులు చేసే 'అతి' ని తగ్గించి పెర్ఫార్మన్స్ చేసాడని తెలుగు అభిమానులు కౌంటర్ ఇస్తున్నారు.గతంలో వెంకటేష్ నటించిన 'ఆడవారి మాటలకు అర్థాలే వేరులే' చిత్రాన్ని ధనుష్ రీమేక్ చేసిన విషయాన్నీ గుర్తు చేస్తున్నారు. ఈ విధంగా ట్విట్టర్ లో పరస్పర విమర్శలు చేసుకుంటూ టాలీవుడ్ వెర్సెస్ కోలీవుడ్ అనే విధంగా ట్వీట్లు పెడుతున్నారు.వాస్తవానికి తెలుగు ప్రేక్షకులు కంటెంట్ బాగుంటే తమిళ చిత్రాలను ప్రోత్సహిస్తూ ఉంటారు. తెలుగు హీరోల మాదిరిగానే కోలీవుడ్ స్టార్ హీరోల చిత్రాలకు ఇక్కడ భారీ ఓపెనింగ్స్ తెచ్చిపెడుతుంటారు. అయినా సరే టాలీవుడ్ హీరోల చిత్రాలపై తమిళులు నెగెటివ్ కామెంట్స్ పెడుతుంటారని తెలుగు ఆడియన్స్ అంటున్నారు. ఈ సందర్భంగా సోమవారం రాత్రి 10 గంటలకు స్ట్రీమింగ్ అయిన 'నారప్ప' చిత్రానికి.. 11 గంటలకే కొన్ని తమిళ వెబ్ సైట్స్ నెగెటివ్ రివ్యూస్ ఇవ్వడాన్ని గుర్తు చేస్తున్నారు. ఇన్ సెక్యూర్ ఫీల్ అవడం వల్లనే టాలీవుడ్ హీరోలపై ఇలాంటి నెగిటివిటీ స్ప్రెడ్ చేస్తున్నారని అంటున్నారు. ఇదిలా ఉంటే ఇప్పుడు తమిళ దర్శకులు తెలుగు హీరోలతో సినిమాలు చేస్తుంటే.. టాలీవుడ్ స్టార్ డైరెక్టర్లు తమిళ హీరోలతో సినిమాలు చేస్తున్నారు. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తో స్టార్ డైరెక్టర్ శంకర్ చఖీఅ15 అనే పాన్ ఇండియా ప్రాజెక్ట్ రూపొందించనున్నారు. అలానే రామ్ పోతినేని హీరోగా దర్శకుడు లింగుస్వామి ఓ బైలింగ్విల్ సెట్స్ పైకి తీసుకెళ్లారు.మరోవైపు శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ధనుష్ ఓ సినిమా చేయనున్నాడు. వంశీ పైడిపల్లి – విజయ్ కాంబినేషన్ లో ఓ మూవీ తెరకెక్కనుంది. ఇవే కాకుండా మరికొన్ని సినిమాలు – తమిళ ఫిలిం మేకర్స్ హీరోలు కలిసి చేయనున్నారు. ఈ నేపథ్యంలో తెలుగు – తమిళ అభిమానులు రోజుల్లో సోషల్ మీడియాలో ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోడానికి ఫుల్ స్టాప్ పెడతారేమో చూడాలి.

## మోక్షజ్ఞతో ఆదిత్య 369 మ్యాక్స్,, బాలయ్య ద్విపాత్రలు

నటసింహ నందమూరి బాలకృష్ణ నటించిన క్లాసిక్ మూవీ 'ఆదిత్య 369' ఈ ఏడాదితో 30 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సంగతి తెలిసిందే. లెజెండ్ సింగీతం శ్రీనివాసరావు ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఇప్పుడు ఈ సినిమాకి సీక్వెల్ గా 'ఆదిత్య 369 మ్యాక్స్' తెరకెక్కనుందని నటసింహ నందమూరి బాలకృష్ణ వెల్లడించారు. 2023లో ఈ సినిమా రిలీజవుతుందని కూడా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇక ఈ చిత్రంలోనూ టైమ్ ట్రావెల్ మెషీన్ తో అడ్వాన్స్ డ్ టెక్నాలజీతో విజువల్ ట్రీట్ ఉంటుంది. ఇందులో తాను ద్విపాత్రలు పోషిస్తానని శ్రీకృష్ణ దేవరాయలు తరహాలో రెండు పాత్రలు ఉంటాయని కూడా బాలయ్య తెలిపారు. ఇక ఈ సినిమాకి కథను ఎన్బీకే రాస్తున్నారు. దర్శకుడు ఎవరు అన్నది త్వరలోనే వెల్లడిస్తారు. ఈ సీక్వెల్ ని తనే స్వయంగా నిర్మించనున్నారు.ప్రస్తుతం బోయపాటితో నటసింహ 'అఖండ' లాంటి భారీ చిత్రం చేస్తున్నారు. ఈ మూవీ అక్టోబర్ లో దసరా కానుకగా రిలీజవుతుందని తెలిపారు. తదుపరి గోపిచంద్ మలినేని- అనీల్ రావిపూడితో సినిమాలు చేస్తున్నానని అలాగే హారిక అండ్ హాసిని క్రియేషన్స్ లోనూ ఓ సినిమా చేస్తానని బాలయ్య వెల్లడించారు. ఇక పైసా వసూల్ దర్శకుడు పూరి జగన్నాథ్ తో మరో సినిమా ఉంటుందని కూడా బాలకృష్ణ వెల్లడించారు. ఆయన నుంచి బ్యాక్ టు బ్యాక్ ధమాకా ఉంటుందని అభిమానులు దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు.బ్లాక్ డ్రెస్ ధరిస్తే ప్రమాదం?మరో ఆసక్తికర విషయాన్ని తాజా చాటింగ్ లో బాలకృష్ణ వెల్లడించారు. ఆదిత్య 369 సమయంలో తనకు యాక్సిడెంట్ జరిగింది. దానికి కారణం ఆదివారం నాడు తాను బ్లాక్ డ్రెస్ లో ఉండడమేనని బాలకృష్ణ తెలిపారు. పరిశ్రమలో సెంటిమెంట్లను అనుసరించడంలో ఎన్బీకే తరువాతే.



## 'సలార్' ఇంటర్వెల్ బ్యాంగ్ 'ధూమ్ 3' రేంజులో!?

ప్రస్తుతం అన్ లిమిటెడ్ బడ్జెట్లతో పాన్ ఇండియా సినిమా ట్రెండ్ నడుస్తున్న సంగతి తెలిసిందే. 300– 500 కోట్ల మధ్య బడ్జెట్ పెట్టేందుకు సౌత్ లో నిర్మాతలు వెనకాడడం లేదు. బహుభాషల్లో ఈ ఫార్మాట్ పెద్ద స్థాయి లాభాల్ని అందిస్తుండడంతో ఇలాంటి రిస్క్ చేసేందుకు సిద్ధమవుతున్నారు.అయితే అంత రిస్క్ చేసేప్పుడు ఎంచుకునే కంటెంట్ లో దమ్ము కూడా అలానే ఉండాలి. దర్శకుడు పాన్ ఇండియా సినిమాల్ని యూనివర్శల్ యాక్సెప్టెన్సీతో తెరపై ఆవిష్కరించాల్సి ఉంటుంది. ముఖ్యంగా సినిమాకి క్లైమాక్స్ ఎంత ముఖ్యమో తొలి అర్థగంటలోనే ఆడియెన్ ని పూర్తిగా కథ పరంగా ట్రావెలింగ్ లోకి తీసుకెళ్లగలగడం అంతే ముఖ్యం. ఆ సమయంలో అసహనానికి గురైతే ఇక అంతే సంగతి. మూవీలో ప్రీఇంటర్వెల్ ట్విస్టు.. ఇంటర్వెల బ్యాంగ్ ఆడియెన్ ని కుర్చీ అంచుకు చేరుకునేంతగా థ్రిల్ కి గురి చేయాలి. ప్రీ క్లైమాక్స్ క్లైమాక్స్ వరకూ కళ్లప్పగించి చూసేంత ఎగ్జయిట్ మెంట్ ని తెరపై ఆవిష్కరించాలి.బాలీవుడ్ లో ధూమ్ ఫ్రాంఛైజీ సినిమాలు రేస్ ఫ్రాంఛైజీ సినిమాల ఘనవిజయం వెనక ఇలాంటి ఎగ్జయిటింగ్ ఎలిమెంట్స్ ఎన్నయినా చూడొచ్చు. ఇక మిస్టర్ పర్ఫెక్ట్ అమీర్ ఖాన్ నటించిన ధూమ్ 3 సంచలన విజయం సాధించడం వెనక ఆ మూవీలో ఎన్నో రకాల ఎలిమెంట్స్ సాయమయ్యాయని చెప్పాలి. ముఖ్యంగా ధూమ్ 3 ఇంటర్వెల్ బ్యాంగ్ ట్విస్టును అభిమానులు అంత తేలిగ్గా మర్చిపోలేరు. అప్పటివరకూ అమీర్ ఖాన్ ఒకరే అనుకునే ఆడియెన్ కి సడెన్ గా ట్విస్ట్ ఎలివేట్ అవుతుంది. అతడు ట్విన్ బ్రదర్స్ లో ఒకడు అని తెలుస్తుంది. అమీర్ అసాధారణ సర్కస్ ఫీట్ల వెనక ద్విపాత్రల్ని ఓపెన్ చేసిన తీరు ఆద్యంతం ఉత్కంఠను పెంచుతుంది.ఇప్పుడు సలార్ చిత్రానికి కేజీఎఫ్ ప్రశాంత్ నీల్ అదే తరహాలో అదిరిపోయే ఇంటర్వెల్ బ్యాంగ్ ని ఇవ్వనున్నారా? అంటే అవుననే టాక్ వినిపిస్తోంది. ఇది మాఫియా కథాంశం. డాన్ లు కాప్ లతో సావాసం. కథ పరంగా ఎన్నో ఎగ్జయిటింగ్ ఎలిమెంట్స్ ఉండనున్నాయి. తాజా సమాచారం ప్రకారం.. సలార్ షూటింగ్ కొత్త షెడ్యూల్ త్వరలో ఖీఈఅ లో ప్రారంభమవుతుంది. దీనికోసం ప్రత్యేక సెట్లు వేస్తున్నారు. ముఖ్యంగా ఈ మూవీ ఇంటర్వెల్ బ్లాక్ ఈ సెట్లలోనే చిత్రీకరిస్తారు. రెండు వారాల కంటే ఎక్కువ కాలం చిత్రీకరణ సాగనుంది. దీనికోసం చాలా కాలంగా చాలా ప్రీ-ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. ఇక ఇప్పటికే ఈ మూవీలో విజువల్ ట్రీట్ ఇచ్చే క్రేజీ ఎలివేషన్స్ తో ఫైట్ సీక్వెన్సులను రూపొందించారు. తాజా షెడ్యూల్స్ లో వందలాది జూనియర్ ఆర్టిస్టులు యాక్షన్ సీక్వెన్సుల్లో పాల్గొననున్నారు. ఇక శ్రుతిహాసన్ ఈ షెడ్యూల్ లో చేరతారా లేదా అన్నది ఇంకా చెప్పలేం.ఓవైపు 'ఆదిపురుష్ 3డి' చిత్రీకరణతో బిజీగా ఉన్న ప్రభాస్ మరోవైపు సలార్ షెడ్యూల్స్ కోసం అటూ ఇటూ షఫుల్ అవుతున్నారు. ఇరు సినిమాల సెట్లలో అతడు సందడి చేస్తున్నారు. అందుకు తగ్గట్టు తన రూపాన్ని కూడా బ్యాలెన్స్ చేస్తున్నారు. సలార్.. ఆదిపురుష్ 3డి ఒకేసారి తెరకెక్కనుండడంతో లుక్ పరంగా చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారని సమాచారం. సలార్ లో శ్రుతి హాసన్ కథానాయికగా నటిస్తుండగా ఆదిపురుష్ 3డిలో కృతి సనోన్ కథానాయికగా నటిస్తుండడం ఆసక్తికరం. ఈ ఇద్దరు ముద్దుగుమ్మల నడుమ అభినయం పరంగా పోటీ అనివార్యం. సలార్ లో శ్రుతి అల్ట్రా మోడ్రన్ గాళ్ గా యాక్షన్ మోడ్ లో కనిపించనుండగా కృతి సనోన్ సాంప్రదాయ కట్టు బొట్టుతో సీతాదేవిగా కనిపించనున్నారు.

## చరిత్ర సృష్టించనున్న 12 ఏళ్ల సిరియా ఒలింపియన్

టోక్యో: 12 ఏళ్ల వయసులో మీరు ఏం చేస్తున్నారు? మనలో చాలా మంది బహుశా ఆరు లేదా ఏడో తరగతిలో చదువుకుంటూ ఉంటాం. కానీ నిత్య రణభూమిగా ఉండే సిరియాలాంటి దేశం నుంచి వచ్చిన టేబుల్ టెన్నిస్ ప్లేయర్ హెండ్ జాజా మాత్రం టోక్యో ఒలింపిక్స్‌లో చరిత్ర సృష్టించబోతోంది. ఆమె వయసు కేవలం 12 సంవత్సరాలే. ఈ ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న అతి పిన్న వయసు అథ్లెట్ జాజానే కావడం విశేషం. అంతర్యుద్ధంతో సతమతమయ్యే సిరియాలాంటి దేశంలో ఆటలను కెరీర్‌గా తీసుకోవడమే సాహసమనుకుంటే.. ఆమె మాత్రం ఏకంగా 12 ఏళ్ల వయసులోనే ఒలింపిక్స్‌లో ఆడబోతోంది.ఆల్‌టైమ్ యంగెస్ట్ ఒలింపియన్లలో ఒకరిగా జాజా నిలవబోతోంది. చివరిసారి 1968 ఒలింపిక్స్‌లో 11 ఏళ్ల ఫిగర్ స్కేటర్ బీట్రైస్ హుస్టియు తర్వాత మళ్లీ ఇప్పుడు ఇంత తక్కువ వయసున్న అథ్లెట్ ఒలింపిక్స్‌లో పార్టిసిపేట్ చేస్తోంది. ఈ నెల నుంచి టేబుల్ టెన్నిస్ పోటీలు ప్రారంభమైన తర్వాత జాజా చరిత్ర సృష్టించనుంది. ఇంటర్నేషనల్ టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ ప్రకారం ఆమె పుట్టింది 2009, జనవరి 1న. ఆ లెక్కన ఆమె వయసు 12 ఏళ్ల 6 నెలలు.ప్రస్తుతం ఆమె అండర్-13 బాలికల కేటగిరీలో ప్రపంచంలో 46వ ర్యాంక్‌లో ఆమె ఉంది. ఇప్పుడు ఒలింపిక్స్‌లో వరల్డ్ బెస్ట్ ప్లేయర్స్‌తో తలపడబోతోంది. స్వదేశంలో యుద్ధ వాతావరణాన్నే కాదు.. ఏడాదిన్నర కాలంగా కరోనా మహమ్మారి విసిరిన సవాళ్లను కూడా ఎదుర్కొని ఆమె ఒలింపిక్స్‌లో అడుగుపెట్టింది. గతేడాది ఫిబ్రవరి 2020లో జోర్డాన్‌లో జరిగిన క్వాలిఫయింగ్ టోర్నీ ద్వారా ఆమె అర్హత సాధించింది. హెండ్ జాజా ఈ టోక్యో ఒలింపిక్స్‌లో యంగెస్ట్ అథ్లెట్. మరి ఓవరాల్‌గా ఒలింపిక్స్‌లో యంగెస్ట్ అథ్లెట్ ఎవరో తెలుసా? అతని పేరు దిమిత్రియోస్ లౌండ్రాస్. అతడో గ్రీకు జిమ్నాస్ట్. 1896లో జరిగిన తొలి ఆధునిక ఒలింపిక్స్‌లో పాల్గొన్నాడు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**